ప్రజాశక్తి

శుక్రవారం 30 జూన్ 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు

గుల్ల చేస్తున్న బిల్లు

- ఛార్జీల షాక్‌తో వినియోగదారుల విలవిల
- ట్రూ అప్, సర్‌ఛార్జీల పేరుతో నిరంతరాయంగా భారం
- ప్రతి బిల్లుకు రూ.200-300 వరకు వసూలు
- మరో విద్యుత్ పోరాటానికి వామపక్షాలు - నేడు ధర్నాలు

నియోజకవర్గ కేంద్రమైన తాడికొండలో నిరసన తెలుపుతున్న వామపక్షాలు

విద్యుత్ ఛార్జీలను ఇబ్బడిముబ్బడిగా పెంచడంపై వామపక్షాలు మరో ఉద్యమానికి సన్నద్ధం అవుతున్నాయి. పెరిగిన విద్యుత్ బిల్లుల భారాలు, స్మార్టు మీటర్లు, ట్రూఅప్ ఛార్జీల వసూలును నిరసిస్తూ శుక్రవారం పల్నాడు, గుంటూరు జిల్లాల్లోని విద్యుత్ కార్యాలయాల వద్ద వామపక్ష పార్టీలు ధర్నాలు చేయనున్నాయి. సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ, సిపిఐ (ఎంఎల్) రెడ్‌స్టార్, ఎంసిపిఐ (యు) తదితర పార్టీల ఆధ్వర్యంలో ధర్నా జరగనుంది.

2 లో

4 లో

ప్రీమియం కడితేనే పరిహారం

8 లో

పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏరువాక

వార్తలు లోపలి పేజీల్లో

పిడుగురాళ్లలో

ఘనంగా భక్రీద్ వేడుకలు

నిర్వాసితులకు అండగా నిలుద్దాం

- రేపు పోలవరం నిర్వాసితుల పోరాట సంఘీభావ నిధి వసూలు
- సహకారం ఇవ్వాలని ఉద్యోగులు, కార్మికులకు సిఐటియు విజ్ఞప్తి

ప్రజాశక్తి - గుంటూరు

విలేకర్లతో మాట్లాడుతున్న నాయకులు

పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని కోరుతూ జూన్ 20 నుంచి జూలై4వ తేదీ వరకు సాగుతున్న పోలవరం నిర్వాసితుల పాదయాత్రకు మద్దతు తెలియజేయాలని ఉద్యోగులు, కార్మికులకు సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ, కార్యదర్శి బి.లక్ష్మణరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పాతగుంటూరులోని జిల్లా కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. నిర్వాసితులకు పునరావాసం కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. నిర్వాసితుల సమస్య పరిష్కారం కోసం జరుగుతున్న పాదయాత్రకు సంఘీభావంగా ఉద్యోగులు, కార్మికులు తమవంతు సహకారం అందించాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు వల్ల మూడు మండలాల్లోని వేలాది మంది ప్రజలు సర్వం కోల్పోతున్నారని, వారిని ఆదుకోవడానికి జరిగే పోరాటానికి ప్రజలందరూ ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో శనివారం నిర్వహించే పోలవరం నిర్వాసితుల పోరాట సంఘీభావ నిధి వసూలు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

కష్టాల్లో రైతులు, కౌల్దార్లు

- సమస్యల పరిష్కారం కోసం నేడు మహాధర్నా
- విజయవాడకు తరలిరావాలని రైతు సంఘం పిలుపు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అజయ్‌కుమార్ ఇతర నాయకులు

ప్రజాశక్తి - గుంటూరు

రైతులు, కౌలురైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారం కోసం విజయవాడలో శుక్రవారం చేపట్టే మహాధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బ్రాడీపేటలోని సంఘం కార్యాలయంలో గురువారం పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ వ్యవసాయంలో పెట్టుబడులు విపరీతంగా పెరిగినా పంటలకు మద్దతు ధరలు మాత్రం లేకపోవడంతో రైతు కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల విత్తనాలు దగ్గర నుంచి మార్కెట్ వ్యవస్థ వరకు రైతు దగా పడుతున్నారని, కల్తీ, నకిలీ విత్తనాలు ఒకవైపు మరొకవైపు ప్రభుత్వ సబ్సిడీలు సరిగా అందకపోవటం, శాస్త్రవేత్తలకే అర్థం కాని రకరకాల వైరస్‌లు చీడపీడలతో పంటలన్నీ దెబ్బతింటున్నాయని చెప్పారు. ఈ పరిస్థితిని అధిగమించడానికి కేరళ తరహాలో పంటకు అదనంగా 50 శాతం ఆదాయం వచ్చేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇతర దేశాల్లో రైతులకు 50 నుంచి 80 శాతం వరకు వివిధ రూపాల్లో సబ్సిడీలను అక్కడి ప్రభుత్వాలు అమలు చేస్తుండగా ఇండియాలో మాత్రం 2 శాతమే ఇస్తున్నారని, అదికూడా సరిగా అమలు కావడం లేదని విమర్శించారు. పాడిపంటలు రెండూ సముపాళ్లలో గిట్టుబాటు అయితేనే రైతు కుటుంబాలు బాగుంటాయని, అది దేశాభివృద్ధికీ తోడ్పడుతుందని అన్నారు.

సహకార రంగాన్ని దెబ్బతీసే విధంగా ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు సహకారం సంఘాలను కేంద్ర ప్రభుత్వం అప్పగిస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సహకార రంగాలను ప్రోత్సహించి ఆదుకోవాల్సి ఆదుకోవాల్సింది పోయి, గుజరాత్ అమూల్ డెయిరీని తెచ్చి ఈ రంగంలో వచ్చే లాభాలను పాడి రైతులు అందకుండా గుజరాత్‌కు తరలేలా వ్యవహరించడం దారుణమన్నారు. జిల్లాలో ఉన్న సంగం డెయిరీని సహకార రంగంలో కొనసాగిస్తూ ఎన్నికలు నిర్వహించాలన్నారు.
సహకారంగాలను దెబ్బతీస్తే

2లో

డాక్టర్స్‌డే సందర్భంగా అనన్య హాస్పిటల్‌లో రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

డాక్టర్స్ డే సందర్భంగా పల్నాడు బస్టాండ్ లోని అనన్య హాస్పిటల్‌లో ఇటీవల నూతనంగా ప్రారంభించిన భవనంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తామని హాస్పిటల్ అధినేత, ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ సింగరాజు సాయికృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో ఫిజీషియన్ - డయాబెటాలజిస్ట్ డాక్టర్ సింగరాజు విద్య ఆధ్వర్యంలో బిపి, షుగర్, ఈసిజి, థైరాయిడ్, తదితర సాధారణ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని, డాక్టర్స్ డే సందర్భంగా జులై నెలలో ఉచిత ఒపి, రక్త పరీక్షల్లో 30 శాతం రాయితీ కల్పిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని నరసరావుపేట పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శాశ్వత చలివేంద్రం ఏర్పాటు

సింగరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో తమ హాస్పిటల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శాశ్వత చలివేంద్రాన్ని డాక్టర్స్ డే సందర్భంగా ప్రారంభిస్తామని డాక్టర్ సాయికృష్ణ తెలిపారు.

కోటప్పకొండకు పోటేత్తిన సందర్శకులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఏకాదశి పర్వదిన సందర్భంగా ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వర సన్నీధిలో గురువారం యాత్రికుల రద్దీ నెలకొంది.ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారు జామునుంచే భక్తులు వేలాదిగా కొండకు తరలి వచ్చి స్వామిని దర్శించుకొని ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ ఈవో జి.శ్రీనివాసరెడ్డి, పాలక మండలి సభ్యులు ఏర్పాట్లును పర్యవేక్షించారు. స్వామి దర్శనం అనంతరం భక్తులు పర్యాటక కేంద్రాన్ని సందర్శించారు. తొలి ఏకాదశి సందర్భంగా నరసరావుపేట చిలకలూరిపేట బస్టాండ్ పరిధిలో ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసింది. చంద్ర, ప్రమీల నల్లపాటి ఫౌండేషన్ వ్యవస్థాపకులు టిడిపి రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్ ఆధ్వర్యంలో తొలి ఏకాదశి సందర్భంగా కోటప్పకొండ వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రజాశక్తి - మాచర్ల

తొలి ఏకాదశి సందర్భంగా మండల పరిధిలోని ఏత్తిపోతల రంగనాథస్వామి దేవాలయానికి యాత్రికులు పోటేత్తారు. వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో పలు మార్లు ట్రాఫిక్ జామ్ అయి ఇబ్బంది పడ్డారు. దిగువన దేవాలయం వద్ద టెంట్స్ సరిపడ లేకపోవటంతో క్యూలైనులో నిలబడ్డ వారు ఎండలోనే నిలబడి స్వామి వారిని దర్శించుకున్నారు. చంద్రవంక వాగులో నీటి ప్రవాహం తక్కువగా ఉండటంతో ఇబ్బంది పడ్డారు. స్నానమాచరించే ప్రదేశాన్ని కొద్దిగా వెడల్పు చేసి నీటిని నిల్వచేసి తగిన ఏర్పా ట్లు చేసి ఉంటే బాగు ఉండేదని పలువురు వాపోయారు. డిఎస్‌పి పల్లంరాజు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రజాశక్తి - వినుకొండ

తొలి ఏకాదశి, బక్రీద్ సందర్భంగా పట్టణ, గ్రామీణ ఆర్ఎంపి అండ్ పిఎంపి వైద్యుల ఐక్యవేదిక వినుకొండ యూనియన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని పట్టణంలోని సీనియర్ వైద్యులు డాక్టర్ గోగినేని సాంబశివరావు ప్రారంభించారు. ఈ సంధ్భంగా ఆయన మాట్లాడుతు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందుకూడా ఉచితంగా అందజేయడాన్ని అభినందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాశం నాగమల్లేశ్వరరావు, పి వెంకటేశ్వరరెడ్డి, కె.బ్రహ్మానందం పాల్గొన్నారు.

గుల్ల చేస్తున్న బిల్లు

- ఛార్జీల షాక్‌తో వినియోగదారుల విలవిల
- ట్రూ అప్, సర్‌ఛార్జీల పేరుతో నిరంతరాయంగా భారం
- ప్రతి బిల్లుకు రూ.200-300 వరకు వసూలు
- మరో విద్యుత్ పోరాటానికి వామపక్షాలు - నేడు ధర్నాలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత నాలుగేళ్లలో ఏడు సార్లు విద్యుత్ ఛార్జీలుపెరిగాయి. విద్యుత్ పంపిణీ సంస్థలకు నష్టాలు వస్తున్నాయనే సాకుతో ఏళ్ల తరబడి వివిధ రకాల ఛార్జీల వసూలు కొనసాగింపు వల్ల సాధారణ ప్రజలకు వినియోగించుకున్న యూనిట్లతో వచ్చే బిల్లు కంటే అదనపు ఛార్జీల భారం ఎక్కువగా ఉంటోంది. సగటున నెలకు రూ.200 నుంచి రూ.300 వరకు అదనపు భారం పడుతోంది. 100 నుంచి 150 యూనిట్లు వినియోగించే మధ్య తరగతి ప్రజలకు సాధారణ ఛార్జీల బిల్లు రూ.500 వరకు వస్తుండగా ఇతరఛార్జీలు రూ.300 వరకు భారం పడుతోంది. ట్రూ అప్ చార్జీలు ఏకంగా 36 నెలలపాటువసూలు చేయాలని నిర్ణయించారు. 2021 మేలో ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలు, సాధారణ సర్‌ఛార్జి, కస్టమర్ ఛార్జీ, ఫిక్స్‌డ్ ఛార్జీ, ఎలక్ట్రిసిటీ డ్యూటీ ఇలా అదనపు భారం ప్రతి బిల్లుకు రూ.200పైనే ఉంటోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా గృహ విద్యుత్ వినియోగదారులపై ప్రభుత్వం విపరీతమైన భారం మోపుతోంది.

ఉమ్మడి జిల్లాలో మొత్తం 17.50 లక్షల మందిపై వినియోగదారులు ఉండగా వీటిల్లో 16 లక్షల మంది పేద, మధ్య తరగతికి చెందిన వారే ఉన్నారు. జిల్లా వాసులపై ఏటా రూ.60 కోట్లకుపైగా అదనపు భారం పడుతోంది. సాధారణ వినియోగ ఛార్జీలతో పాటు ట్రూఅప్ ఛార్జీలు ప్రతి యూనిట్‌కు సగటున 1.50 పైసలు భారం పడనుంది. వీటిపై స్థిర ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, బిల్లు చెల్లింపులో ఆలస్యానికి అదనపు రుసుం కూడా పడనుంది. గతేడాది ఏప్రిల్ ఒకటి నుంచి ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రతి నెలా వసూలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 11 నెలలు వసూలు చేశారు. ఇంకా 25 నెలలు వసూలు పర్వం కొనసాగనుంది. ట్రూఅప్ వల్ల ప్రతినెలా రూ.30 నుంచి రూ.100 వరకు అదనపు భారం పడుతోంది. 2014-2019లో డిస్కంలకు వచ్చిన నష్టాలకు సంబంధించి ఇప్పుడు వసూలు చేయడం ఏమిటని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.

ఈ ఛార్జీల వసూలు పరంపర కొనసాగిస్తూనే తాజాగా 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన డిస్కంలకు వచ్చిననష్టాలకు కూడా గతనెల బిల్లు నుంచి వసూలు చేయాలని నిర్ణయించారు. యూనిట్‌కు రూ.40 పైసలు అదనంగా వసూలు చేయనున్నారు. ఇలా ఏడాదిపాటు ఈభారం పడుతుంది. ట్రూఅప్, 2021 మే నెలలో వాడుకున్న విద్యుత్‌కు సర్దుబాటు ఛార్జీ, 2023 ఏప్రిల్ నెలలో సర్దుబాటు ఛార్జీల రూపంలో మొత్తంగా కనీసం రూ.200 నుంచి గరిష్టంగా రూ.300 వరకు అదనపు బిల్లులు వసూలు చేస్తున్నారు. వాస్తవంగా వినియోగించుకున్న యూనిట్లకు కన్నా ఇతరఛార్జీల భారం రూ.200 నుంచి రూ.300 వరకు అదనంగా చెల్లించాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. రానున్న రెండేళ్లపాటు ట్రూ అప్ చార్జీల భారం కొనసాగనుంది. ఎగువ మధ్య తరగతి వారికి ఈ భారం ప్రతినెలా రూ.400 నుంచి రూ.500 ఉంటోందని వినియోగదారులు వాపోతున్నారు. చిన్న, మధ్య తరహ పరిశ్రమలకు రూ.వెయ్యిపైనే భారం పడుతోంది. ఇప్పటికే సంక్షోభంలోఉన్న పరిశ్రమలు అదనపు బాదుడుతో మరింత కుదేలవుతున్నారు. స్మార్టు మీటర్ల కొనుగోలుకయ్యే భారం నుంచి వినియోగదారుల నుంచి వసూలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

కష్టాల్లో రైతులు, కౌల్దార్లు

(మొదటి పేజీ తరువాయి)

భవిష్యత్తులో కల్తీ పాలు తయారై ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీసే ప్రమాదం ఉందరి హెచ్చరించారు. గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డలో ఎర్రవాగుతో ముంపు, కొండవీటి వాగు ముంపుతో వేలాది ఎకరాలు పంటలు దెబ్బతింటున్నాయని, వీటికి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న గుంటూరు ఛానల్ పొడిగింపు సమస్యను ప్రభుత్వం సత్వరం పరిష్కరించకుంటే ఐక్య కార్యాచరణతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. గుంటూరు ఛానల్‌తోపాటు ఇతర పంట కాల్వల్లో పూడికతీత, తూటికాడను తొలగింపు పనులు చేయిస్తే నీరు సరిగా పారుదై పొలాలకు చేరుతుందన్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వలన ఆ నీరు పంట పొలాలుగా చేరి పంటలు దెబ్బతింటున్నాయని, ఈ సమస్యకూ శ్వాశత పరిష్కారం చూపాలని కోరారు. వ్యవసాయ పంపు సెట్లకు మీటర్ల బిగించే చర్యలను మానుకోవాలన్నారు. ఈ సమస్యలన్నింటిపైనా విజయవాడలో అలంకార్ థియేటర్ సెంటర్లో జరిగే మహాధర్నాకు రైతులు, కౌలు రైతులు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఐ.రామారావు, ఆది నికల్సన్, కృష్ణకాంత్, ఎ.కల్యాణి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు

మహా ధర్నా జయప్రదం కోసం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పెదనందిపాడులో ఆటో ప్రచార జాతాను నిర్వహించారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, రైతు ఐక్యవేదిక నాయకులు కుర్రా హరిబాబు, రైతు సంఘం సీనియర్ నాయకులు కన్నెగంటి చంద్రరావు మాట్లాడారు. ఈ ఏడాది అకాల వర్షాలు, అధిక వర్షాలు వల్ల దెబ్బతిన్న పంటలకు వెంటనే ఇన్పుట్ సబ్సిడీని ఇవ్వాలని, సమగ్ర పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం కనీసం మద్దతు ధరలు చట్టం తేవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చిన విధంగా పాడి రైతులకు లీటరుకు రూ.4 బోనస్ విడుదల చేయాలని, సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు ఇవ్వడంతోపాటు రాయితీలు, సబ్సిడీలు, రైతు భరోసా, ఇతర పథకాలను కౌల్దార్లకు వర్తింపజేయాలని కోరారు. ఈ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు చేపట్టిన మహాధర్నాను రైతులు, కౌలురైతులు జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా పెదనందిపాడు మండలంలోని ఉప్పలపాడు, జరుగుల వారిపాలెం, మిట్టపాలెం, అన్నవరం, పరిటాలవారిపాలెం, పాలపర్రు, రాజు పాలెం, పెదనందిపాడు, నాగులపాడు, వరగాని, అన్నపర్రు, ఏబీ పాలెం, జిజి పాలెం, రావిపాడు, గోగులమూడి,

పెదనందిపాడులో ఆటో ప్రచార జాతాను ప్రారంభించి మాట్లాడుతున్న నాయకులు

కట్రపాడు, కాకుమాను మండలంలోని కొమ్మూరు, గార్లపాడు, పెద్దవారిపాలెం గ్రామాలలో ప్రచారం చేశారు. గ్రూప్ మీటింగులతోపాటు కరపత్రాలు పంపిణీ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, సిఐటియు జిల్లా నాయకులు కాకుమాను నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు జంపని రామారావు, చుక్కా యానాదులు, రావి శివరామకృష్ణయ్య, నల్లమోతు రాజేంద్ర, పసుపులేటి శేషగిరిరావు, మండవ సింగయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కొల్లిపర

కొల్లిపర మండలంలో ప్రచారం చేస్తున్న నాయకులు, రైతులు

అన్ని పంటలకూ మద్దతు ధరలు ప్రకటించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శివసాంబిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నా జయప్రదం కోసం వల్లభాపురం, మున్నంగి, శివలూరు, అత్తోట గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డీ రాయితీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, సున్నా వడ్డీని రూ. రెండు లక్షలకు, పావలా వడ్డీని రూ.ఐదు లక్షలకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో తెనాలి వీరయ్య, పరిమి ప్రకాష్‌రావు, సికాపల్లి లాజరు, దర్శి బర్నబా, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా యువకుడు దుర్మరణం

మృతుడు సంతోష్ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ సంఘటన సత్తెనపల్లి మండలం భృగుబండ-పాకాలపాడు గ్రామాల మధ్య గురువారం జరిగింది. ఈ ప్రమాదంలో భృగుబండ గ్రామానికి చెందిన దుగ్గి సంతోష్ (21) అక్కడికక్కడే మృతి చెందగా అదే గ్రామానికి చెందిన దుగ్గి విజయ్ తీవ్రంగా గాయపడ్డాడు. ట్రాక్టర్ నేర్చుకునేందుకు సంతోష్, విజయ్ తో కలిసి వెళ్ళాడు.పొలం దున్నిన అనంతరం ఇంటికి వచ్చే క్రమంలో ట్రాక్టర్ నడుపుతున్న సంతోష్, రోడ్డు పైకి వచ్చేందుకు మలుపు తిప్పుతుండగా అదుపు తప్పి పక్కన ఉన్న కేంద్రంలోకి బోల్తాపడింది. సంతోష్, విజయ్ లు ట్రాక్టర్ కింద ఇరుక్కుపోయారు. గమనించిన చుట్టూ ప్రక్కల రైతులు వచ్చి ట్రాక్టర్ కింద వారిని బయటకు తీసే ప్రయత్నం చేశారు. విజయ్ ను బయటకు తీయగా సంతోష్ ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. విజయ్ తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనం ద్వారా గాయపడిన విజయ్ ను సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ తర లించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఆసుపత్రికి తరలిం చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా యువకుడు మృతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మండలంలోని గుత్తికొండలో శరీరానికి మంటలతో యువకుడు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుత్తికొండ గ్రామానికి చెందిన దార్ల సాంబశివరావు(26) ఐటిఐ వరకు చదువుకొని గ్రామంలో విద్యుత్ పనులు చేస్తుండేవాడని బుధవారం సాయంత్రం గుత్తికొండ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో వ్యక్తి మంటలలో తగలబడుతున్న దృశ్యాన్ని అటుగా వెళ్తున్న కొందరు చూశారని చెప్పారు. వెంటనే పోలీసులకు , 108 సిబ్బందికి సమాచారం అందించారని అన్నారు. 108 వాహ నం వచ్చే లోపు సాంబశివ రావు కాలిపోయి చనిపోయాడని తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలం వద్దకు వచ్చి ఘటన జరిగిన తీరును పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం

పూర్తిగా కాలిపోయి చనిపోయిన మృతుడు దార్ల సాంబశివరావు

మతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు జరిగిన ఘటన హత్య లేదా ఆత్మహత్య అని విచారణ చేస్తున్నామని కేసు నమోదు చేశామని తెలియజేశారు.

బ్రహ్మారెడ్డి అనుచరుడి అరెస్టు కలకలం

ప్రజాశక్తి-మాచర్ల

మాచర్ల పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు జూలకంటి బ్రహ్మరెడ్డి ప్రధాన అను చరుడిని బుధవారం రాత్రి పోలీ సులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. షేక్ అన్వర్‌బాషా బుధవారం అర్ధరాత్రి సమయంలో పోలీసులు ఇంటికి వచ్చి అదుపులోకి తీసుకున్నారు. అతన్ని గురువారం సాయంత్రం మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా రిమాండ్ విధించారు. కొద్ది రోజుల క్రితం కారంపూడి గ్రామంలో తెలుగుదేశం పార్టీ, వైసిపి పార్టీ వర్గీయుల మధ్య జరిగిన వివాదం సందర్భంగా నమోదు అయిన కేసులో అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

మద్యం సేవించే వారిపై 4564 కేసులు : ఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గత ఏడాదికాలంలో జిల్లాలో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే 4836 మంది పై 4564 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. మద్యం సేవించే వారిపై టౌన్ న్యూసెన్స్ చట్టం ప్రకారం ఐపిసి సెక్షన్ల క్రింద కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కేసులు నమోదు చేయడం వల్ల జిల్లాలో క్రైమ్ రేట్ తగ్గిందని,రోడ్ ప్రమాదాల కేసులు కూడా నివారణ, నియంత్రణ జరిగిందని, మద్యం సేవించడం వల్ల కుటుంబం లో మనస్పర్ధలు తలెత్తే అవకాశముందని, ఆర్థికంగా వెనుకబడిన పోతారని అందువల్ల మద్యం సేవించడం వల్ల దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తున్నట్టు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెం దిన ఘటన పట్టణంలోని ప్రభుత్వ జూని యర్ కళాశాల సమీపంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం పట్టణానికి చెందిన కుమారి (42), అల్లుడు శివనాగరాజుతో కలిసి పిడుగురాళ్ల నుండి కొండమోడు వైపు వెళు తుండగా ప్రమాదవశాత్తు బైకు జారీ పడిపోయింది. దీంతో, వెనుక నుండి వస్తున్న లారీ, కుమారి తలపై నుండి వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి-తెనాలి

పేకాట శిభిరంపై పోలీసులు దాడి చేశారు. రూరల్ గ్రామం నందివెలుగు శివారు పొలాల్లో పేకాట ఆడుతున్న సమాచారంతో రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు నేతృత్వంలో గురు వారం దాడి చేశారు. పేకాడుతున్న ఆరుగురు బృందాన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1550 నగదు, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ఎలక్ట్రిసిటీ బిల్స్‌పై నేడు అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఎలక్ట్రిసిటీ బిల్స్‌పై 30వ తేదీన అవగాహనా కార్యక్రమం నిర్వహించనున్నారు. చాలా మంది వినియోగదారులకు వారి ఎలక్ట్రిసిటీ బిల్లులలో వివరాలు అర్ధంకాని పరిస్థితి ఉందని ఈ నేపథ్యంలో తమ సంస్థ 'మీ ఎలక్ట్రిసిటీ బిల్స్ గురించి తెలుసుకోండి' అనే కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సంస్థ పేర్కొంది. గత రెండు మూడు నెలల బిల్లులకు, కొత్తగా వచ్చిన బిల్లులకు ఇంత తేడా ఎందుకు వేస్తున్నారు అనే విషయాలపై అవగాహన కల్పిస్తారని, విద్యుత్ వినియోగదారులు వారి బిల్లులను తీసుకురావాలని విజ్ఞప్తి చేసింది. సంస్థ కార్యాలయంలో 30వ తేదీ సాయంత్రం 4.30 గంటల నుండి 6.30 వరకు విద్యుత్ వినియోగదారుల సంఘాల నాయకులు, విశ్రాంత ట్రాన్స్‌కో ఉద్యోగులు నలుగురు అందుబాటులో ఉంటారని తెలిపింది. గుంటూరు నగర పరిధిలోని వినియోగదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరింది. సందేహాలను నివృతి చేస్తారని, ఆరోగ్యాభిలాషులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

2న ఆరోగ్య సభ

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన సంస్థ ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఆరోగ్య సభలలో భాగంగా జులై 2న శ్వాసకోవ, ఊపిరితిత్తుల వ్యాధులు, సమస్యలపై సభను నిర్వహించనున్నారు. ఈ మేరకు సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. ఆదివారం ఉదయం 11 గంటలకు స్థానిక అరండల్‌పేట 15/1లోని అవగాహన సంస్థ కార్యాలయంలో నిర్వహించనున్న సభలో ప్రముఖ చెస్ట్ ఫిజీషియన్ డాక్టర్ ఎస్, తేజ ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగిస్తారని, వర్షాకాలంలో ఎక్కువగా ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు-తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వివరిస్తారని తెలిపారు.

ప్రజల చిరునవ్వులతోనే సమాజం ఆనందమయం

ప్రజాశక్తి-గుంటూరు

నవ్వు ముఖానికి పెట్టని ఆభరణం లాంటిందని సంతోషాన్ని, ప్రేమను పంచిపెట్టే చిరునవ్వులతో సమాజం ఆనందమయంగా మారుతుందని అవగాహన సంస్థ హాస్యవల్లరి కార్యక్రమంలో పాల్గొన్న హాస్యప్రియులు అభిప్రాయపడ్డారు. స్థానిక అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో హాస్యవల్లరి 'నవ్వు..నవ్వించు' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన హాస్య చక్రవర్తి, గాయకుడు ఆర్‌పిఎల్ నరసింహారావు మాట్లాడుతూ దేశం ఏదైనా, మాట్లాడే భాష ఏదైనా ప్రపంచ వ్యాప్తంగా అందరికీ అర్ధమయ్యే భాష నవ్వు అని అన్నారు. కష్టం ఎంతైనా తరగతి చిరునవ్వు, చెదరని ఆత్మవిశ్వాసానికి ప్రతీక అని అన్నారు. ప్రముఖ నాటక దర్శకుడు కావూరి సత్యనారాయణ మాట్లాడుతూ నవ్వు మానసిక ఉల్లాసానికి, ఆరోగ్యానికి మంచి దని వైద్యులు చెబుతున్నా రని, అయితే, ప్రజలంతా సంతోషంగా ఉండే పరిస్థితి నేడు లేద న్నారు. పరిమళం లేని ప్లాస్టిక్ పువ్వులా, జీవం లేని నవ్వుని ఒకటి ముఖాన పులుము కుని బతుకుబండి లాగుతున్న ప్రజలు సంతోషంగా కనిపించే పరిస్థితిని కల్పించడం పాలకుల బాధ్యత అని అన్నారు.

In the Court Of The Prl' Junior Civil Judge, NARASARAOPET.
OS. NO. 481/2021.

బిట్వీన్:-
జవ్వాజి మల్లికార్జునరావు ...వాది.
మరియు
తగిరిశ సుజాత ...ప్రతివాది.

పై నెంబర్ దావాలో వాది ప్రతివాది నుండి బాకీని వసూలు చేసుకొనుటకు దావా వేసి ఉన్నారు. ప్రతివాదికి అనేక పర్యాయములు సదరు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీ నోటీసు నిమిత్తం ఈ పేపర్ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. ది.19-07-23 వాయిదా అయి ఉన్నది. సదరు వాయిదా రోజు ఉదయం 10:30 ని.లకు మీరు స్వయంగా కానీ న్యాయవాది గారి ద్వారా కానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై దావాను శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షంగా విచారించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం

వాయిదా ది. 19-07-2023.
30-06-2023.

ఇట్లు.
కె.బుచ్చిదంతాచారి..
వాది తరపు న్యాయవాది,
నరసరావుపేట,Cell.No:- 9441655377

Before The 1st Addl. Motor Accident Claims Tribunal : Nellore
M.V.O.P.No. 328 / 2020

1. Talamanchi Anusha
and 2 others - Claimants
Vs
1. Pchalapalli Ravindra Reddy
and 2 others - Respondents

Notice to 2 nd Respondent

B. Ahmed Shaik, S/o **S.S.Peeran,**
Residing at F.No.404,
Swagruha Apartments, Palakalluru Road,
Gujjanaguntla, Guntur, Guntur District.

పై నెంబరున క్లయిమెంట్స్ మీపై నష్టపరిహారము కోరుతూ పై తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసి యున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే10-7-2023**దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదారోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులోహాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎ.వి.ఎస్. రవీంద్ర కుమార్, బి.ఎ., బి.ఎల్.,
క్లయిమెంట్స్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

CHANGE OF NAME

I BATTULA SREENIVASA RAO (Old Name) S/o BATTULA HANUMANTHA RAO, Resident of at D.No:14-4-142, 2nd Floor, Mathru Sri Nilayam, 6th Lane Brundavan Gardens, Guntur, Guntur District-522006, AP, Hence I Have Changed my name to **BATTULA SRINIVASA RAO (New Name)** hereafter My Name is known as **BATTULA SRINIVASA RAO (New Name)**

డాక్యుమెంట్లు పోయినవి

విశ్వనాథపల్లి మరియమ్మ భర్త వి.జాను గారు డోర్ నెం.18-10 గల గుంటూరు డి. నల్లపాడు సబ్.డి॥ అంకిరెడ్డిపాలెం శివారు, వెంగళయపాలెం గ్రామ పంచాయతీ ఏరియాలో చేరిన గ్రామ డి.నెం.1252/A రు లక్ష్మి నరసింహపురం గుంటూరు జిల్లా. సెల్.9346449519 అను నేను తేది 12-06-2023 పై అడ్రసు నుంచి డాక్యుమెంట్ నెం.41/BK111/5 ఇంటి తాలుక వీలూనామ రిజిస్ట్రేషన్ ఓరిజినల్ పట్టా జిరాక్స్‌లు తీయించుకొని మరల ఇంటికి తిరిగి వచ్చి చూసుకొనగా ఓరిజినల్ దస్తావేజులు వీటికి సంబంధించిన లో వైనపు దస్తావేజులు పెట్టిన కవరు కనపడలేదు. కనుక ఎవరికైన దొరికిన యెడల పైన తెలిపిన అడ్రసుకు అందచేయగలరు. లేనిచో ఫోను చేసి తెలుపగలరు. దీనిపై ఎట్టి లావాదేవిలు జరిపిన యెడల అవి చెల్లనేరవని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ప్రకటన

గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, పెనుమాక గ్రామ కాపురస్థుడైన భీమవరపు వెంకటరెడ్డి గారి కుమారుడు సురేంద్రరెడ్డి గారి వద్ద నుండి సంజాయిషీ పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

నా క్లయింటు అయిన భీమవరపు సురేంద్రరెడ్డి గారు యీ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిని 1)మేకా మోహనరెడ్డి గారి భార్య కమల 2)మేకా మోహనరెడ్డి గారి కుమారుడు గోపాల క్రిష్ణారెడ్డి 3)మేకా వీర వెంకటేశ్వరరెడ్డి గారి కుమారులు మేకా హాయగ్రీవరెడ్డి 4)మేకా జయ రామిరెడ్డి 5)మేకా విజయ భాస్కరరెడ్డి 6)మేకా పూర్ణ చంద్రరెడ్డి గారి వద్దనుండి కొనుగోలు చేయు నిమిత్తం ది.19-06-2023వ తేదీన విక్రయ ఖరారు అగ్రిమెంటు అయి ఉన్నారు. సదరు షెడ్యూలు దాఖలా ఆస్థిపై ఎవరికైననూ ఎలాంటి హక్కు భుక్తములు ఉన్నను, లావాదేవీలు యున్ననూ, కోర్టు జప్తులు ఉన్ననూ, యీ ప్రకటన వెలువడిన 7 రోజులు లోగా నాకు గాని, నా క్లయింటునకు గాని తగు ఆధారములతో వ్రాత పూర్వకముగా తెలియపరచవలెను. లేని యెడల సదరు ఆస్థి నిష్పేచి ఆస్థిగా భావించి రిజిష్టరు చేయించుకొనగలడని, తదుపరి వచ్చు అభ్యంతరము గాని, ఆక్షేపణలు గాని నా క్లయింటును భైందు జేయవని యిందుమూలముగా తెలియపరచటమైనది.

షెడ్యూలు

గుంటూరు జిల్లా, మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పోరేషన్ ఏరియా, మంగళగిరి సబ్.డి యిలాకా, తాడేపల్లి మండలం, పెనుమాక గ్రామ పంచాయితీ యేరియాలో చేరిన పెనుమాక గ్రామం తాలూకు డి.నెం.2014బి, 202 ర్లు బాపతు మాకు హక్కు కలిగి మీకు విక్రయ ఖరారుపడిన నివేశన స్తలమున్నూ, సదరు స్థలములో గల రైసుమిల్లు, ఆర్.సి.సి.డాబాయిల్లు వగైరాలకు హద్దులు.
తూర్పు:-కల్లం నరేంద్ర రెడ్డి వగైరాల స్థలము హద్దు.
దక్షిణం:-పంచాయితీ బజారు హద్దు
పడమర:-తురకా వెంకట్రావు వగైరాల స్థలము హద్దు.
ఉత్తరం:- చిల్లర వీరాంజనేయులు వగైరాల స్థలము హద్దు.
తిరిగి తూర్పు:-మేకా రామసుబ్బారెడ్డి వగైరాల ఆస్థి హద్దు
తిరిగి ఉత్తరం:-జాయింటు నడవ దారి హద్దు.
యీ హద్దుల మధ్య య.0,57.94 సెంట్లు లేక చ.గ.2804.49 లు లేక చ.మీ.2344.83 ర్లు స్థిరాస్తి నివేశన స్తలమున్నూ, సదరు స్థలములో గల రైస్‌మిల్లు, ఆర్.సి.సి.డాబాయిల్లు వగైరాలున్నూ, మరియు సదరు స్థలమునకు లోగాయున్న యావత్తు పాత రివాజు నడవ, దారి, యీజుమెంటు హక్కులతో సహా.

మంగళగిరి, **కోకా వెంకట ప్రసాద్,**
29-06-2023, **అడ్వకేట్,**
మంగళగిరి.

మీడియాతో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

చంద్రబాబుకు పవన్ డబ్బింగ్

తుస్సు యాత్రగా కన్నా బస్సు యాత్ర

మంత్రి అంబటి రాంబాబు విమర్శలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చపలచిత్తం మాటలు మాట్లాడటం మానుకోవాలని నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గురువారం ఆయన స్థానిక వైసిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గోదావరి జిల్లాల్లో పర్యటిస్తున్న పవన్ ఏదేదో మాట్లాడుతున్నారని, పవిత్రమైన వారాహి పేరు పెట్టుకున్న వాహనంపై కూర్చొని అభద్దాలు మాట్లాడటం అపచారమని విమర్శించారు. జనసేన పార్టీని పెట్టి టిడిపి అధినేత చంద్రబాబుకు డబ్బింగ్ చెప్పే ఖర్మ ఎందుకని ప్రశ్నించారు. పవన్ చేసే ప్రతి ప్రసంగంలో జగన్ పోవాలి అని నినాదం ఉంటోందని, జగన్ పోతే ఎవరు వస్తారనే విషయాన్నీ ఆయన చెప్పాలని అన్నారు. జగన్ పోతే ప్రజాసంక్షేమ పోతుందని రాష్ట్ర ప్రజలు భావిస్తున్నారని, అందుకే మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలని జనం కోరుకుంటున్నారని అన్నారు. పోలవరంలో ప్రాజెక్టులో బండ కుంగిన విషయంపై నిపుణుల కమిటీ అధ్యయనం చేస్తోందని, అది అంత ప్రమాదకరమైన అంశం కాదని అన్నారు. టిడిపి ఇంచార్జీ కన్నా లక్ష్మీ నారాయణ నిర్వహిస్తున్న బస్సు యాత్ర నాయకులు, కార్యకర్తలు లేక తుస్సు యాత్రగా మారిందని ఎద్దేవ చేశారు. టిడిపిలో చివరిదాకా ఉంటారా? పార్టీ ఫిరాయిస్తారా? అని ప్రశ్నించారు. 2024 ఎన్నికల్లో పోటీ చేస్తారా? లేదా పారిపోతారా? అని ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు.

ప్రజాశక్తి-పిఎస్‌వికె ఆధ్వర్యంలో రేపు ఉచిత వైద్యశిబిరం

వైద్యరంగ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-సత్తెనపల్లి

డాక్టర్స్ డే సందర్భంగా ప్రజాశక్తి - పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం (పిఎస్‌వికె) సంయుక్త ఆధ్వర్యంలో సత్తెనపల్లి పాత బస్టాండ్ కూరగాయల మార్కెట్ పక్కన గల పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం, ప్రజాశక్తి ప్రచురించిన వైద్యరంగం ప్రత్యేక సంచిక ఆవిష్కరణ శనివారం ఉంటుందని ప్రజాశక్తి సత్తెనపల్లి డివిజన్ ఇన్‌ఛార్జి నీరుకొండ కృష్ణ, పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ పొట్టి సూర్యప్రకాశరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు వచ్చి వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. షుగరు, బీపీ, గుండె, దంత, కళ్లు, ఎముకలు, నరాలు, కిడ్నీ గ్యాస్ట్రో, చెవి, ముక్కు, వంటి వ్యాధులకు, పిల్లలకు, స్త్రీలకు, జనరల్ వైద్య సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. మందులనూ ఉచితంగా అందిస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 6301960931, 9440255165 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వినుకొండ తిరునాళ్లలో తిప్పలు

- కొండపైకి ఎక్కలేక మోరాయించిన బస్సులు
- ఘాట్ రోడ్డులో వాహనాల రద్దీతో పాదచారులకు ఇబ్బందులు
- ప్రత్యామ్నాయా మార్గాల్లో బండలపై పాకుతూ కొండపైకి
- ఆర్టీసీ బస్సులో టిక్కెట్‌కు రూ.40 వసూలపైనా విమర్శలు

కొండ వద్ద రద్దీ.. బండరాళ్ల మీదుగా వెళ్తున్న సందర్శకులు.. కోటప్పకొండ పేరుతో ఉన్న టిక్కెట్

ప్రజాశక్తి - వినుకొండ

తొలి ఏకాదశి సందర్భంగా వినుకొండ కొండపై శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం వేడుకలు నిర్వహించారు. గతేడాది నూతనంగా ఏర్పాటు చేసిన ఘాట్ రోడ్డు మార్గాన వేలాది మంది సందర్శకులు వచ్చారు. సీత జాడ విన్న కొండగా ప్రసిద్ధికెక్కిన వినుకొండ తిరుణాళ్లను చూడ్డానికి చుట్టుపక్కల గ్రామాల నుండే కాకుండా ఇతర జిల్లాల నుండి కూడా ప్రజల తరలివచ్చారు. వేడుకల్లో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. ఏర్పాట్లను దేవదాయ, మున్సిపల్, పోలీస్ శాఖాధికారులు పర్యవేక్షించారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సులు..

తిరునాళ్ల సందర్భంగా కొండపైకి వినుకొండ ఆర్‌టిసి డిపో బస్సు సౌకర్యం కల్పించింది. కొండపై ఘాట్ రోడ్డు బస్సు రాకపోకలకు అనుకూలంగా లేకపోయినా అధికార పార్టీ వత్తిడితే సర్వీసులను నడిపారు. 30 బస్సులను ఏర్పాటు చేసి నడపగా అధిక శాతం బస్సులు ఘాట్‌రోడ్డు ఎగువలో ఎక్కలేక మొరాయించాయి. కింద నుంచి అతి కష్టంపై వెళ్లిన ఆర్టీసీ బస్సులు మూడో మలుపు ఎగమూరు వద్దకు వెళ్లగానే పికప్ డౌన్ అయ్యి ఎక్కలేక కండెన్సర్ల నుండి పొగలు వచ్చి బస్సులు నిలిచిపోయాయి. అక్కడి నుండి ప్రయాణికుల్ని కిందకు దించి పంపించారు. దీంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కొక్కరి వద్ద నుండి టిక్కెట్‌కు రూ.40 వసూలు చేసి మధ్యలో దింపేయడం ఏమిటని ప్రశ్నించారు. మరోవైపు ఘాట్ రోడ్డు మధ్యలో నిలిచిపోయిన బస్సులను సురక్షితంగా కిందకు పంపించేందుకు పోలీసులు, ఆర్టీసీ సిబ్బంది అవస్థ పడ్డారు. ఇదిలా ఉండగా వినుకొండ ఘాట్ రోడ్ నుండి కొండపైకి ఆర్టీసీ బస్సు టిక్కెట్ రూ.40 తీసుకోవడం, దానిపై కొటప్పకొండ టు వినుకొండ అని ఉండడం విమర్శలకు గురైంది. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని కొందరన్నారు.

సదుపాయాల కల్పనలో విఫలం

సందర్శకులకు కల్పించాల్సిన సదుపాయాలపై జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ తదితరులు రెండ్రోజులుగా పర్యటించి పలు సూచనలు చేశారు. అయితే వాటి అమలులో సంబంధిత శాఖాధికారులు తీవ్రంగా విఫలమయ్యారు. ఘాట్ రోడ్డులో ఆర్టీసీ బస్సులు, కార్లు ద్విచక్ర వాహనాల రాకపోకలతో రద్దీ ఏర్పడి నడిచేవారికి ఇబ్బంది కరంగా మారింది. కొంతమంది రాళ్లపైనుండి ప్రమాదకర స్థితిలో పాక్కుంటూ వెళ్లారు. పలువురు జారిపడ్డారు. దర్శనం వద్ద క్యూలోనూ తోపులాట తలెత్తింది. ఆర్టీసీ బస్సులు ఎగమూరు వద్ద కండెన్సర్లు కాలి పొగలు రావడంతో ప్రయాణికులు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

ప్రీమియం కడితేనే పరిహారం

- ఉచిత పశు బీమాకు ప్రభుత్వం మంగళం
- పరిహారం మొత్తంలోనూ పరిమితులు, కోతలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పశువులు అనారోగ్యంతో లేదా ప్రమాదవశాత్తు మృతి చెందితే వాటి పశు పోషకులు నష్టపోకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ పశు నష్టపరిహార పథకాన్ని అమలు చేసింది. ఈ పథకంలో భాగంగా పశువులుకు ఉచితంగానే బీమా సదుపాయం కల్పించారు. ఇప్పటి వరకు పల్నాడు జిల్లాలో మృతి చెందిన పశువులకు సంబంధించిన పాడి రైతులకు నూరుశాతం పరిహారం దక్కింది.

తాజాగా ఈ పథకంలో ప్రభుత్వం మార్పులు తెచ్చింది. పథకం పేరును వైఎస్ఆర్ పశు బీమాగా మార్పు చేసినా ఉచిత బీమాను మాత్రం రద్దు చేసింది. మెరుగైన విధంగా బీమాను అమలు చేస్తామని, పరిహారాన్ని సకాలంలో అందిస్తామని చెబుతున్న ప్రభుత్వం మరోవైపు పల్నాడు జిల్లాలో క్లష్టర్ల వారి కేటాయింపుల్లో భాగంగా నేషనల్ ఇన్సూరెన్స్ బీమా కంపెనీ నమోదు చేస్తుండగా బీమా మధ్యవర్తిగా యన్ ట్రస్ట్ ఇన్సూరెన్స్ బ్రోకింగ్ సర్వీస్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ వ్యవహరిస్తోంది. గతంలో పశువులు చనిపోతే ప్రీమియం ఏమీ చెల్లించకుండానే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించేది. అది కూడా చనిపోయిన ఆవు, గేదె, మేకలు, గొర్రెలకు వర్తింపజేసేవారు. ప్రస్తుతం ప్రభుత్వం ఈ పథకంలో అనేక మార్పులు చేసి కొత్త నిబంధనలు తెరపైకి తెచ్చింది. అందులో పేర్కొన్న నిబంధన ప్రకారం పశు పోషకులు నిర్దేశిత ప్రీమియం చెల్లించి బీమా చేయించుకుంటేనే పరిహారం అందుతుంది. అది కూడా ఒక మేలు జాతి పశువుకు ప్రీమియం ఎంత ఎక్కువ చెల్లించినా పరిహారం మాత్రం రూ.30 వేలే ఇస్తామని ప్రకటించింది. ఎస్సీ, ఎస్టీ పశు పోషకులకు రూ.30 వేలు విలువ చేసే ఆవు, గేదే, ఎద్దు, దున్నలకు మూడేళ్ల కాల పరిమితికి రూ.384- ప్రీమియం చెల్లించాలి. మిగతా సామాజిక తరగతుల వారు రూ.960 చెల్లించాలి. రూ.15 వేలకు బీమా చేయించుకుంటే రూ.192, రూ.480 చెల్లించాల్సి ఉంటుంది. రూ.30 వేల కంటే ఎక్కువ ధర ఉన్న పశువులకు అదనంగా బీమా మొత్తం చెల్లించినా బీమా సంస్థ మాత్రం రూ.30 వేలే ఇస్తుంది.

గొర్రె, మేక, పందులకు రూ.6 వేలే

గొర్రెలు, మేకలు, పందులకు ఒక ఏడాది, రెండు, మూడేళ్ల కాల పరిమితికి బీమా చేసుకునే వెసులుబాటు ఉంది. ఆయా జీవాల పెంపకం దారుల్లో ఎస్సీ, ఎస్టీలకు రూ.36, ఇతరులు రూ.90 చెల్లించాలి. రెండేళ్లకు రూ.54, రూ.135, మూడేళ్లకు రూ.75, రూ.187.50 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ జీవాలు చనిపోతే ఒక్కో దానికి రూ.6 వేలు చొప్పున పరిహారం చెల్లిస్తారు.

ఎన్ని ఉన్నా 5 పశువులకు 50 జీవాలకు మాత్రమే బీమా..

ఉచిత పశు బీమా పథకం అమలులో ఉన్నప్పుడు రైతుకు ఎన్ని పశువులున్నా ఆవులు, గేదెలు, మేకలకు, గొర్రెలకు వర్తింపజేశారు. ఇంతకుముందు కేవలం ఆవులు, పశువులు, గొర్రెలు, మేకలకు మాత్రమే బీమా వర్తింపజేసేవారు. ప్రస్తుతం దున్నలు ఎద్దులు పందులకు కూడా బీమా పరిహారం ఇస్తామని ప్రకటించారు. ఒక కుటుంబంలో, గేదెలు, ఆవులు, ఎద్దులు, దున్నలు ఎన్ని ఉన్నా గరిష్టంగా 5 పశువులకు, గొర్రెలు, మేకలు, పందులకు 50 జీవాలకు మాత్రమే బీమా వర్తింపజేస్తున్నారు. అర్హులైన వారు రైతు భరోసా కేంద్రంలో, సచివాలయ సిబ్బంది ద్వారా వివరాలు నమోదు చేసుకొని బీమాకు సంబంధించి ప్రీమియం చెల్లించాలి. బీమా చేసిన 15 రోజుల నుండి అమలులోకి వస్తుంది. పశువుకు ప్రాణ నష్టం వాటిల్లితే బీమా కంపెనీ సిబ్బంది వచ్చి వైద్యుని పర్యవేక్షణలో పోస్ట్‌మార్టం నిర్వహించి వివరాలు నమోదు చేసుకుంటారు.

మొదటి ఈత పాలిస్తూ రెండేళ్లు పైబడి 10 ఏళ్ల వయసు లోపున్న ఆవు, మొదటి ఈత పాలిస్తూ 3-12 ఏళ్లలోపు వయసు గేదెకు బీమా వర్తిస్తుంది. ప్రస్తుతం ప్రైవేటు బీమా సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని ఇప్పుడు ప్రీమియం కట్టించుకుంటున్నారు. నిర్దేసించిన సమయంలోగా ప్రీమియం అందుతుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు బీమా కోసం దరఖాస్తు చేసుకున్న వారికి 100 శాతం బీమా చెల్లించగా మృతి చెందిన 330 పశువులకు సంబంధించి బిల్లులు చేసి ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంది. 2019 లో పశు గణన లెక్కల ప్రకారం పల్నాడు జిల్లాలో ఆవుజాతి పశువులు 66072, గేదె జాతి 467046, గొర్రెలు 469424, మేకలు 156291, పందులు 1645 ఉన్నాయి.

21 రోజుల్లో అన్నీ చెల్లింపు

ప్రీమియం చెల్లింపులో రైతు భాగస్వామ్యం ఉంటే పరిహారం చెల్లింపులో ఆ సంస్థకు బాధ్యత ఉంటుంది. పశు ప్రాణ నష్టం వాటిల్లితే ధ్రువీకరణ ప్రక్రియ పూర్తయిన 21 రోజుల్లో పరిహారం చెల్లించేలా సంస్థతో ప్రభుత్వానికి ఒప్పందం కుదిరింది. జిల్లాలో పశు బీమా నమోదు లక్ష్యం మొదటి విడత 14 వేలుగా నిర్దేశించారు. ఇప్పటికే 6 వేలు పూర్తి చేశాం.

కె.కాంతారావు, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి.

నేటికీ అదే (నీ)తీరు

ఘటన జరిగిన రోజుల కాలువలో ఉన్న పైప్‌లైన్(నాడు)

- మొక్కుబడిగా మరమ్మతులు
- కొలకలూరు ఎస్సీ కాలనీలో దుస్థితి
- డయేరియా ప్రబలి నేటికి ఏడాది
- పైప్‌లైన్లు మురుగు కాల్వల్లోనే..
- అప్పుడప్పుడు మురుగునీరే గతి
- ఫలితాన్నివ్వని కలెక్టర్, ప్రజాప్రతినిధుల పర్యటనలు

ప్రజాశక్తి-తెనాలి

డయేరియా మహమ్మారి ఎస్సీ కాలనీలో బాలికను బలి తీసుకుని నేటికి సరిగ్గా ఏడాది. బాలికతో పాటు దాదాపు 200 మంది కాలనీ వాసులు ఆసుపత్రి పాలయ్యారు కూడా. ప్రజలకు రక్షిత మంచినీరు అందించటంలో ప్రజాప్రతినిధులు, అధికారుల వైఫల్యమే ఆ బాలికను బలితీసుకోవటంతోపాటు, ప్రజల అనారోగ్యానికి కారణమైందన్న వాస్తవాన్ని బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు ఏకరువు పెట్టారు. దీంతో జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా యంత్రాంగం మొత్తం గ్రామంలో నెలరోజులు మకాం వేసినా నేటికీ సమస్య మూలాలను పెకలించలేకపోయారు. డయేరియా ప్రభలటానికి ఏ తాగునీరు కారణమైందో అదే పైప్‌లైన్, అదే మురికి నీటినే ఇప్పటికీ ప్రజలకు అందిస్తున్నారు. రూరల్ గ్రామం కొలకలూరు ఎస్సీ కాలనీపై పాలకులు, అధికారులు వివక్షకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

గతేడాది జూన్ 30న గ్రామంలోని ఎస్సీకాలనీలో డయేరియా ప్రభలింది. కాలనీ వాసులు గొరికపూడి చినకోటేశ్వరరావు మణిమ్మ దంపతుల కుమార్తె శ్రీనిధి(14) వాంతులు, విరోచనాల బారిన పడి మృతి చెందింది. దీనికి తోడు గ్రామంలో మరికొంత మంది వాంతులు విరోచనాల బారిన పడ్డారు. క్రమక్రమంగా బాధితుల సంఖ్య పెరగటంతో అధికార యంత్రాగం స్పందించి. కాలనీలో డయేరియా ప్రభలినట్టు గుర్తించారు. తాగునీరు కలుషితం కారణంగానే పిరిస్థతి ఎదురైందని గమనించి, పంచాయతీ కుళాయిల నుంచి సరఫరా చేస్తున్న నీటిని నిలిపి వేశారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా దాదాపు 45 రోజులు తాగు నీరు అందించారు. తాగునీటిలో కాంటినెంటర్ కాఫీ ఫ్యాక్టరీకి చెందిన వ్యర్థాలు కలుస్తున్నాయని స్థానికులు అధికారులకు మొరపెట్టుకున్నారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు గ్రామలోని పిహెచ్‌సి, జెడ్పీ పాఠశాల్లో మెడికల్ క్యాంపు నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు వైద్యఆరోద్యశాఖా మంత్రి విడదల రజని, స్థానిక శాసనసభ్యులు బాధితులను పరామర్శించి, పరిస్థితిని చక్కదిద్దుతామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో సీపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, ఆపార్టీ నాయకులు అప్పట్లో గ్రామంలో పర్యటించారు. పరిస్థితిపై స్పందిస్తూ మృతి చెందిన బాలిక కుటుంబానికి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. తదుపరి స్థానిక శాసనసభ్యుల ద్వారా బాలిక కుటుంబానికి ఆర్థిక సాయం అందించి మిన్నకున్నారు. అంతే తిరిగి గ్రామం వైపు అధికారులు కన్నెతి కూడా చూడలేదు.

పరిస్థితిలో మార్పులేదు...

మురుగు కాల్వల్లోనే పైప్ లైన్ - ఇంకా మురికినీరే గతి

నీటి కాలుష్యం కారణంగా పదోతరగతి బాలిక మృతి చెందటం, మరో 200 మందికి పైగా డయేరియాతో అసుపత్రి పాలైనా తాగునీటి సమస్య పరిష్కారంలో మాత్రం అధికారుల స్పందన కరువే. నిధులు మంజూరైనా పనులు చేయిచంటంలో చొరవచూపలేదు. అధికారుల నిర్లక్ష్యంతో ఇప్పటికి ఏడాది గడిచిపోయింది. బాలిక మృతి చెందిన సమయంలో అధికార గణం గ్రామంలో పర్యటించి, తాగునీటి పైప్‌లైన్ మురు గు కాలువల్లో ఉండటం గమనించారు కూడా. ప్రత్యామ్నాయం చూపాలని ఆదేశించినా పరిస్థితిలో ఏమాత్రం మార్పులేదు. పైప్‌లైన్లు మురుగు కాల్వల్లోనే ఉన్నాయి. ఇప్పటికీ తాగునీరు మురికిగానే వస్తున్నాయని కాలనీ వాసులు ఏకరువు పెడుతున్నారు. అధికారులు మాత్రం పనులు ప్రారంభిస్తాం., ప్రారంభించాం., తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం., అన్న సమాధానాలు మినహా ఏడాది గడిచినా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేదు. ఘటన జరిగినపుడు జిల్లా యత్రాంగం మొత్తం గ్రామంలో మకాం వేసి కాలనీ వాసులకు ఎన్ని హామీలిచ్చినా ఆచరణ శూన్యం. వాటర్‌మోటార్లు మార్చామని, కొంత మేర పైప్‌లైన్ మార్చామని చెప్పటం మినహా శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు మాత్రం లేవు. కేవలం ఎస్సీ సామాజిక వర్గ సమస్య కాబట్టే అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

ఏడాది గడిచినా ఇంకా అదే మురుగుకాలువలో పైప్‌లైన్ (నేడు)

అధికారులకు ఫిర్యాదు.. కోర్టులోనూ పిటిషన్

తాగునీటి సమస్యపై అధికారుల అలసత్వాన్ని ప్రశ్నిస్తూ కాలనీ వాసి సుద్దపల్లి పృధ్వీరాజ్, కొలకలూరు రవీంద్ర కుమార్ అధికారులతో పోరాటం చేస్తూనే ఉన్నారు. జిల్లా కలెక్టర్‌కు స్పందనలో పిర్యాదు చేశారు. అలాగే నేషనల్ ఎస్సీ కమిషన్‌కు, పంచాయతీ రాజ్ కమిషనర్‌కు, గ్రామం పంచాయతీ అధికారులకు, మండల పరిషత్ అధికారులకు పిర్యాదు చేశారు. మండల లీగర్ సర్వీసెస్ అథారిటీలో కూడా పిటిషన్ దాఖలు చేశారు. రెండు నెలల్లో సమస్య పరిష్కరిస్తాం, మూడు నెలల్లో సమస్య పరిష్కరిస్తాం అని చెప్పటం మినహా కార్యాచరణ లేదని వారు వాపోతున్నారు.

తాగునీటి పరిస్థితిలో మార్పు లేదు

జి.కోటేశ్వరరావు, మృతి చెందిన బాలిక తండ్రి

మా పాప శ్రీనిధి మరణానికి కేవలం అధికారుల నిర్లక్ష్యమే కారణం. తాగునీరు కలుషితమే పాప ప్రాణం తీసింది. పరిహారంగా కేవలం రూ.5లక్షలు ఇచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారు. కనీసం మా పాప మరణంతో తాగు నీటి పరిస్థితి మెరుగుపడుతుందని ఆశించాం. ఇప్పటికీ ఎలాంటి మార్పు లేదు. పైప్ లైన్ మార్చలేదు. మురుగు కాల్వల్లోనే పైప్‌లైన్ ఉంది. తూతూ మంత్రంగా అక్కడక్కడా పైప్‌లైన్ మార్చినా, తాగునీరు అప్పుడప్పుడు మురికిగానే వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయిలో పైప్‌లైన్ మార్చి సురక్షితమైన తాగునీటిని అందించాలి.

జల్ జీవన్ మిషన్ నిధుల ద్వారా పనులు ప్రారంభించాం

ఎమ్‌డి యాసిన్, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్, తెనాలి

గ్రామంలో గతంకంటే తాగునీరు మెరుగ్గానే ఉంది. ప్రస్తుతం జల్‌జీవన్ మిషన్ పథకంలో రూ.1.44కోట్లతో పైప్‌లైన్ మార్చేందుకు పనులు ప్రారంభించాం. 40 కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని చేపడతాం. దానికి సంబందించి సాయిల్ టెస్టింగ్‌కు కూడా శాంపిల్స్ పంపాం. పైప్ లైన్ నిర్మాణానికి మెటీరియల్ అంతా సిద్దంగా ఉంది. వేసవితీవ్రత నేపథ్యంలను పనుల్లో జాప్యం జరిగింది. గత పదిరోజులుగా పనులు ప్రారంభించాం. మొత్తం మీద నాలుగైతు నెలల్లో పనులు పూర్తి చేస్తాం. మొత్తం మీద తాగునీటికి ఇబ్బంది లేకుండా చేస్తాం.

పైప్‌లైన్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి(ఫైల్‌ఫొటో)

ఎట్టకేలకు కదలిక

పొక్లెయినర్‌తో కొండవీటి వాగులో తూటికాడ తొలగింపు

ప్రజాశక్తి - తాడేపల్లి

గత నాలుగేళ్లుగా మరమ్మతులకు నోచని కొండవీటి వాగులో తూటికాడ తొలగింపు పనులు ఎట్టకేలకు గురువారం ప్రారంభం అయ్యాయి. వాగులో పెద్దఎత్తున తూటికాడ, గుర్రపుడెక్క పేరుకుని వాగు ఆనవాళ్లే కనిపించకుండా పోయాయి. రైతు సంఘంతోపాటు వివిధ రాజకీయ పార్టీలు పలుమార్లు అధికారులను డిమాండ్ చేశారు. అందులో భాగంగా మొదలైన తూటికాడ పనులు వాగు మొత్తం శుభ్రం చేస్తారా? పరిమితంగానే చేస్తారా? అనేది అధికారుల నుండి స్పష్టత కొరవడింది. వాగు మొత్తం శుభ్రం చేసి సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు కోరారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి-తాడేపల్లి

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న మున్సిపల్, విద్యుత్, వైద్య, ఆరోగ్య, నేషనల్ హెల్త్‌మిషన్ తదితర అనేక రంగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. తాడేపల్లి ప్రకాష్‌నగర్‌లోని సిఐటియు కార్యాలయంలో సిఐటియు పట్టణ కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కోర్టు తీర్పు ఉన్నప్పటికీ అంగన్‌వాడీలకు గ్రాడ్యూటీ అమలు చేయడంలేదన్నారు. ఈ సమావేశానికి కె.బాబూరావు అధ్యక్షత వహించగా నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, బి.సాంబశివ రావు, కె.వెంగమ్మ, జి.కొండయ్య, తురకా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తాడికొండలో విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని నిరసన

ప్రజాశక్తి - తాడికొండ

పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే తగ్గించాలని కోరుతూ సిపిఎం సిపిఐ ఆధ్వర్యంలో గురువారం తాడికొండ బస్టాండ్ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికారంలోకి రాక ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలను తుంగలో తొక్కిందని విమర్శించారు ట్రూ అప్ చార్జీలను మోపుతూ ప్రజలపై పెనుబారం మోపిందని ధ్వజమెత్తారు ప్రభుత్వం తమ నిర్ణయాలను మార్చుకోవాలని లేకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. అనంతరం విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చింతల భాస్కరరావు బాణావత్ భద్రయ్య, కనగాల పూర్ణచంద్రరావు, టీ రాజు, పులి డేవిడ్, సిపిఐ నాయకులు ముప్పాళ్ళ శివశంకరరావు, జీవి రాజు, ఆర్ అంజిబాబు పాల్గొన్నారు.

బిజెపి, వైసిపి తోడుదొంగలు

1290వ రోజుకు రాజధాని దీక్షలు

ప్రజాశక్తి - తుళ్లూరు

బిజెపి,వైసిపి నాయకులు తోడు దొంగలని,ఒకరు జేబుదొంగ మరొకరు గజదొంగని రాజధాని మహిళా రైతులు మండిపడ్డారు.గురువారం తొలి ఏకాదశిని పురస్కరించుకొని మందడంలో రైతులు,మహిళలు గ్రామ దేవతలకు సారె సమర్పించారు. రాజధాని నిర్మాణానికి ఆటంకాలు తొలగి పోవాలని వేడుకున్నారు.ఈ సందర్భంగా మహిళా రైతులు వరలక్ష్మి, యర్రమనేని నాగమల్లీశ్వరి మరికొందరు మాట్లాడుతూ, అమరావతి రాజధానిని బిజెపి, వైసిపి కలిసి నాశనం చేయాలని కుట్ర పన్నుతున్నాయని మండి పడ్డారు. ఇక్కడి బిజెపి నాయకులు అమరావతికి మద్దతు అంటారు.. కేంద్రంలో మాత్రం జగన్ ప్రభుత్వానికి వంత పలుకుతూ కపట నాటక మాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధానికి రాజధాని ఉండకూడదని మోడీ కోరుకుంటున్నారని అన్నారు. ఒకపక్క వైసిపి ప్రభుత్వం అవినీతిమయం అంటూనే ఇంకో వైపు కేంద్రంలో ఎడాపెడా అనుమతులు ఇస్తారని, భూముల్ని రాజధాని నిర్మాణానికి ఇచ్చామా.. పందేరం చేయడానికా..అని ప్రశ్నించారు.ఆర్ -5 జోన్ అంశం కోర్టులో ఉన్నప్పటికీ కేంద్రం గహ నిర్మాణాలకు 700 కోట్లు కేటాయించడం సరైంది కాదన్నారు.రైతుల ప్లాట్ల అభివద్ధికి డబ్బులు ఉండవు. గృహ నిర్మాణాలకు మాత్రం ఉంటాయా.. అని నిలదీశారు. రాజధాని అమరావతి నిర్మాణ మెటీరియల్, మట్టి దొంగ తనాలకు ప్రభుత్వమే కారణమన్నారు. ఎవరెన్ని ఆటంకాలు కలిగించినా అమరావతిని సాధించే వరకు ఉద్యమం కొనసాగిస్తా మన్నారు. కాగా రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలంటూ రైతులు చేస్తున్న దీక్షలు గురువారంతో 1290 వ రోజుకు చేరాయి. తుళ్లూరు, మందడం, వెలగపూడి, నెక్కల్లు, అనంతవరం, వెంకట పాలెం తదితర గ్రామాల్లో దీక్షలు సాగాయి. అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించి బిల్డ్ అమరావతి - సేవ్ ఆంధ్రప్రదేశ్, కోర్టు తీర్పును గౌరవించాలని నినాదాలు చేశారు.

కుంచనపల్లి లో సిపిఎం సహాయనిధి సేకరణ

పోలవరం పాదయాత్రకు సిపిఎం సంఘీభావం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి గ్రామంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పోలవరం నిర్వాసితుల, పోరు కేక సిపిఎం పాదయాత్ర బందానికి సహాయ సేకరణ కార్యక్రమం జరిగింది. గ్రామంలోని ప్రధాన రహదారి వెంట సిపిఎం నాయకులు సహాయ నిధి సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి, సిపిఎం కుంచనపల్లి గ్రామ శాఖ కార్యదర్శి అమ్మిశెట్టి రంగారావు, అమ్మిశెట్టి రామారావు, బొడ్డు మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కలిసి మెలిసి ఉంటే గ్రామాభివృద్ధి

- లగడపాడులో పర్యటించిన కలెక్టర్
- సమస్యలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు

ప్రజాశక్తి-పెదకూరపాడు

కలిసి మెలిసి ఉంటే గ్రామాభివృద్ధికి సహకరిస్తామని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ అన్నారు. గురువారం మండలంలోని లగడపాడులో కలెక్టర్ పర్యటించారు. గత కొన్ని సంవత్సరాలుగా సత్రం ప్రాంతం గ్రామంలో వివాదంగా మారింది. ఒక వర్గం సత్రంపై ఫిర్యాదు చేసింది. సత్రంపై గ్రామ సభ నిర్వ హించారు. ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసు కున్నారు. సత్రం ప్రాంతాన్ని లైబ్రరీగా కొనసాగిస్తామన్నారు. దీనికి వీఆర్వో కన్వీనర్ గా పంచాయతీ కార్యదర్శి మహిళా పోలీసు వెల్ఫేర్ అసిస్టెంట్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ సభ్యులుగా ఉంటారన్నారు. శాంతి భద్రతల సమస్య వస్తే ప్రభుత్వం దేనినైనా ఆక్రమించు కోవచ్చని, అవసరమైతే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల అమలు తీరు గురించి ఆరా తీశారు. విద్యార్థులను విజ్ఞాన యాత్రలకు పంపించాలని, పిల్లలకు వాచ్ కొనివ్వాలని,దానివల్ల వారికి కాలం విలువ తెలుస్తుందని అన్నారు. చదువుకునే వయసులో సినిమాలు షికార్లను పక్కనపెట్టాలని, రక్తహీనత బాలికల్లో ఎక్కువగా ఉంటుందన్నారు. 11 నుంచి 18 సంవత్సరాల వయసు ఉన్న ఆడపిల్లలకు ఎక్కువగా కనిపిస్తోందని, వారికి పౌష్టి కాహారం అందించాలని సూచించారు. గురుకుల పాఠ శాలలో సీట్లు కావాలని, పాఠశాల మార్పు చేయాలని కోరుతూ ఈ సందర్భంగా కలెక్టర్‌కు వినతి పత్రాలు అంద జేశారు. అనంతరం కాలనీలో రోడ్లను పరిశీలించారు రోడ్లన్నీ బురద మయంగా ఉంటున్న విషయాన్ని మహిళలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎంపితో మాట్లాడి ఎంపి ల్యాడ్స్ నుంచి రోడ్లు వేయిస్తామని చెప్పారు. జగనన్న ఇళ్ళ కాలనీని పరిశీలించారు. కొంత నిర్మాణం జరిగి ఆగిన చర్చి ప్రాంతాన్ని పరిశీలించారు. విద్యుత్ స్తంభం మార్చాలని కాలనీ వాసులు కోరారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజకుమారి, డిఎల్‌పిఒ సుధాకర్, తహశీల్దార్ క్షమారాణి, ఎంపిడిఒ నరసింహారావు,సర్పంచ్ వి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నల్లపాటి ఫౌండేషన్ అన్నదానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

చంద్ర అండ్ ప్రమీల నల్లపాటి ఫౌండేషన్ వ్యవస్థాపకులు టిడిపి రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం తొలి ఏకా దశి సందర్భంగా కోటప్పకొండ వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ఈ ఏడాది వ్యవసాయం బాగా కలిసి రావాలని అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్య క్రమంలో టిడిపి నాయకులు ఎం.నవీన్ కుమార్, వై. ప్రసాద్, శివ, కె.రామకృష్ణ, కె.వీరాంజనేయులు, వి.సాంబశివరావు, కె.సుధీర్ కుమార్, ఎన్.జగదీష్, పి.వంశీ తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం

ప్రకాశక్తి-చిలకలూరిపేట

నారా ఫౌండేషన్ భాష్యం ప్రవీణ్ ఆధ్వ ర్యంలో స్థానిక ఎన్ఆర్‌టి సెంటర్ లోని రైతు బజార్ ఎదురుగా గురువారం అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించారు. తెలుగుదేశం కార్యకర్తలకు ఆర్థిక చేయూత నిస్తూ, చిరు వ్యాపారులకు సాయం అందిస్తూ, కార్యకర్తల కుటుంబాలకు విద్య, వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు చెప్పారు.

తుమ్మర కోటలో వివాహ వేడుకల్లో పాల్గొన్న బ్రహ్మారెడ్డి

పార్టీని, కార్యకర్తలను కాపాడుకుంటా

ప్రజాశక్తి - రెంటచింతల

ప్రాణాలను పణంగా పెట్టి పార్టీని కార్యకర్తలను కాపాడుకుంటానని, చంద్రబాబు నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యేదాకా శ్రమిస్తూనే ఉంటామని తెలుగుదేశం పార్టీ నేత బ్రహ్మారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తుమ్మర కోటలో వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కారంపూడిలో తమ పార్టీ నేతలపైనే దాడి చేసి అక్రమ కేసులు బనాయించడంపై ఆయన మండిపడ్డారు. నిందితులైన వారికి రాచమర్యాదలు చేస్తున్నారంటూఅధికార పార్టీ తీరుపై ఘాటుగా విమర్శలు చేశారు. భవిష్యత్తుకు గ్యారెంటీ బస్సు యాత్ర విజయవంతం కావడంతో అది చూసి ఓర్వలేని అధికార పార్టీ నేతలు కారంపూడి ఘటన లో మైనార్టీ నేత అన్వర్ బాషాపై 307 సెక్షన్ కింద కేసు నమోదు చేశారని విమర్శించారు. అలాగే మాచర్ల టౌన్ తెలుగు యువత నేత బాబు ఖాన్ పై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. బక్రీదు పండుగ రోజున ఇంట్లో నుంచి తీసుకెళ్లి స్టేషన్ లో పెడితే వారి కుటుంబ సభ్యులు అల్లాడిపోతున్నారని బ్రహ్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు యూనిఫామ్ ధరించిన పోలీసులు అందరి వాళ్ళమని నిరూపించారని, నేడు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సైకోలు రాజ్యమేలుతున్నప్పుడు పాలన వ్యవస్థ లోప భూయిష్టంగా ఉందనడానికి ఈ అక్రమ కేసులే నిదర్శనమన్నారు. వాహ నాలను గ్రామాల్లోకి రానీయకుండా అడ్డుకోవడం, పార్టీ కార్యాలయాలకు నిప్పు పెట్టడం తగదన్నారు. మాజీ సొసైటీ చైర్మన్ లింగా పున్నారావు, సతీషు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది నెలల్లో రోడ్డు పూర్తి చేస్తా

అమరావతి - బెల్లంకొండ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే శంకరరావు

ప్రజాశక్తి - అమరావతి

అమరావతి గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం అమరావతి - బెల్లంకొండ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ప్రారంభించామని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు.శంకరరావు అన్నారు. అమరావతి మండలం ధరణకోట వద్ద అమరావతి - బెల్లంకొండ డబుల్ లైన్ రోడ్డు పనుల ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా నియోజకవర్గ ప్రజలు ఆశగా ఎదురుచూసిన క్షణం వచ్చే సిందన్నారు. అమరావతి - బెల్లంకొండ రోడ్డు పెదకూరపాడు నియోజకవర్గానికి మణిహారంలా మారుతుందన్నారు. అమరావతి నుంచి బెల్లంకొండ వరకు సుమారు 47 కిలోమీటర్ల మేర 10 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్నామన్నారు. దీన్ని 9 నెలల్లో

పూర్తి చేసి తీరతామన్నారు. నియోజకవర్గంలో మాదిపాడు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు.

కోటప్పకొండపై రద్దీ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఏకాదశి పర్వదిన సందర్భంగా ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర సన్నిధిలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది.ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే భక్తులు వేలాదిగా కొండకు తరలి వచ్చి వచ్చారు. ఆలయ ఈవో జి.శ్రీనివాస రెడ్డి, పాలక మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం భక్తులు పర్యాటక కేంద్రాన్ని సందర్శించారు. నరసరావుపేట, చిలకలూరిపేట బస్టాండ్ పరిధిలో ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసింది.

'ధనార్జనే ధ్యేయంగా అధికారులపై వైసిపి దాడులు'

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

గురజాల నియోజకవర్గంలో వైసిపి నాయకులు ధనార్జనే ధ్యేయంగా అధికారులపై కూడా దాడులకు తెగబడుతున్నారని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. దాచేపల్లి మండలంలోని శంకరాపురం గ్రామంలో అటవీ శాఖ అధికారులపై వైసీపీ నాయకులు చేసిన దాడే ఇందుకు నిదర్శనమన్నారు. వైసిపి నాయకులు అడ్డగోలుగా అటవీ ప్రాంతంలో తవ్వకాలు జరిపి విలువైన రంగురాళ్లను దోచుకెళ్తుంటే వాళ్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో వైసిపి నాయకులు అధికారులపై దాడులు చేసి రంగురాళ్లను దోచుకెళ్లే ప్రయత్నం చేశారని ఆరోపించారు. అటవీ శాఖాధికారులు ఈ విషయంపై దాచేపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా పెట్టారని తెలిపారు. 2019 అధికారంలోకి వచ్చిన తర్వాత వైసిపి నాయకులు అటవీ ప్రాంతంలో రంగురాళ్ల అక్రమ తరలింపు చేసి కోట్ల రూపాయలు దోచుకున్నారన్నారు. గురజాల నియోజక వర్గం లో అవినీతి అక్రమాలు మూడు పూవులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుందని అక్రమ మైనింగ్ తెలుగుదేశం పార్టీ నాయకులు పై కేసులు అధికారులపై దాడులు పెరిగిపోయాయని ఆరోపించారు. రాష్ట్రం రావణకాష్టంలో మారిందని ప్రజలు రాక్షస పాలనలో ఇబ్బందులు పడుతున్నారని త్వరలో ప్రభుత్వం మార్పు చెందుతుందని టిడిపి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

త్యాగాలకు ప్రతీక బక్రీద్

సత్తెనపల్లిలో ప్రత్యేక నమాజ్ లో పాల్గొన్న మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

త్యాగాలకు ప్రతీక బక్రీద్ పండుగని రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గురువారం బక్రీద్ సందర్భంగా స్థానిక పెద్ద మసీదు ప్రార్థన ఆవరణలో ముస్లిం మత పెద్దలతో కలసి ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. మత పెద్దలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ మానవత్వాన్ని పరిమళింప జేయాలన్నదే ఈ పండుగ ముఖ్య ఉద్దేశ్య మన్నారు. కార్యక్రమంలో షేక్ నాగుల్మీరాన్, రాష్ట్ర నాయకులు ఎన్.రాజ నారాయణ, పి.సూరిబాబు తదితరులు ఉన్నారు.

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నరసరావుపేట నియోజకవర్గంలో బక్రీద్ పండుగను ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పట్టణంతో పాటు నరసరావుపేట రొంపిచర్ల మండలాల్లోని గ్రామాల్లో గల మసీదులను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఈద్గాల వద్ద ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. పండుగ విశిష్టత గురించి వివరించారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణ అంజుమన్ కమిటీ అధ్యక్షులు ఎండి ఉస్మాన్ మేస్త్రి ఆధ్వర్యంలో జానపాడు రోడ్ లోని ఈద్గా నందు నమాజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండి ఉస్మాన్ మేస్త్రి మాట్లాడుతూ ధనిక, పేద తారతమ్యం లేకుండా ప్రతి ముస్లింలు బక్రీద్ పండుగను జరుపుకుంటారన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వైసిపి మైనార్టీ సెల్ విభాగం అధ్యక్షులు ఎండి గఫార్, పట్టణ అంజుమన్ కమిటీ సెక్రటరీ షేక్ మస్తాన్ వలి, ఖిద్మత్ టౌన్ సోషల్ కమిటీ అధ్యక్షులు ఎండి బాబర్ పాల్గొన్నారు.

నరసరావుపేటలో..

ప్రజాశక్తి - వినుకొండ : నియోజకవర్గంలోని మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక సామూహిక ప్రార్ధనలు నిర్వహించారు. పట్టణంలోని తిమ్మాయపాలెం రోడ్ లోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కిన మల్లికార్జున రావులు హాజరై ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొన్నారు. ఇమామ్ షాహిద్ బక్రీద్ పండుగ విశిష్టతను గూర్తి వివరించారు.

నిలిచిన తాగునీటి సరఫరా

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పెద్ద కోనేరు వద్ద గత రెండు రోజులుగా కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా కావడం లేదు. త్రాగునీరు సరఫరా అయ్యే రోజుల్లోనూ సమయపాలన ఉండటం లేదని స్థానికులు చెబుతున్నారు. ఏ సమయంలో త్రాగునీరు వస్తుందో తెలియటం లేదని ముందస్తు సమాచారం కూడా ఇవ్వటం లేదని వాపోతున్నారు. రెండు రోజులుగా త్రాగునీరు రాకపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు. పెద్ద కోనేరు పరిసర ప్రాంతాల్లో బోరు నీరు కూడా అడుగంటి సరిగా రావడం లేదని ప్రస్తుతం జరుగుతున్న కోనేరు త్రవ్వకమే ఇందుకు కారణం అని వారు భావిస్తున్నారు.

వ్యవసాయ డిప్లొమా కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంపు

ప్రజాశక్తి - తాడికొండ

ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యవసాయ, సేంద్రియ వ్యవసాయ, విత్తన సాంకేతిక పరిజ్ఞానము, వ్యవసాయ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ లకు 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశం కోసం ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులను మొదటగా ఈ నెల 14వ తేదీ నుండి 30వ తేదీన వరకు కోరారు. పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు ఈ నెల 24 వ తేదీన విడుదల చేయడం వలన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల విజ్ఞప్తులు, గ్రామీణ ప్రాంత విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడంలో ఎదుర్కొంటున్న సమస్యలను దృష్ట్యా ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోడానికి తుది గడువును జులై 10వ తేదీ వరకు పొడిగించినట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టరు జి.జి. రామారావు తెలిపారు.

కంపెనీ గేటు ఎదుట నిరసన తెలుపుతున్న వర్కర్స్, సిఐటియు నాయకులు

యాజమాన్యం మొండి వైఖరి వీడాలి

ప్రజాశక్తి- మేడికొండూరు

మండలంలోని పేరేచర్ల నికో ఆగ్రో కంపెనీ వర్కర్స్ సమస్యల పరిష్కారం కోసం ఎప్పటి నుండైనా సమ్మెలోకి వెళ్తామని యూనియన్ సిఐటియు మండల కార్యదర్శి ఎస్ ఎం బాషా స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం 6 గంటలకు కంపెనీ వద్ద సమ్మె డిమాండ్ల పరిష్కారం చేయాలని కోరుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజ మాన్యం మొండి వైఖరి వీడి కార్మికులతో చర్చలు జరపాలన్నారు. సమ్మె నోటీసు ఇచ్చిన తర్వాత యాజమాన్య కక్ష్య చర్యలు సాధింపుగా ఉన్నాయన్నారు. కొద్దిమంది కార్మికులను తొలగించేందుకు ఇచ్చిన నోటీసులను బేశరత్తుగా వెనక్కి తీసుకున్న తర్వాతే చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఇంక్రిమెంట్లు పెంచాలని ,కనీస సౌకర్యాలైన మంచినీరు మరుగుదొడ్లు క్యాంటీన్ వంటి సౌకర్యాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కే శ్రీనివాస రెడ్డి, వి.సాంబశివరావు, శౌరి రాజు,కె.వీర్రాజు, జాన్ పీరా, పి.చలపతి, డి విజయబాబు, శ్రీనివాసరెడ్డి, ఎం.సీతాపతి, ఆర్.మహేష్, బి.నాగరాజు, ఎం.రవి చంద్ర రెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'చేనేత ద్రోహి గంజి'

ప్రజాశక్తి-మంగళగిరి

చేనేత ద్రోహి గంజి చిరంజీవి అని టిడిపి రాష్ట్ర మహిళ కార్యనిర్వహణ కార్యదర్శి ఇంజమూరి ఆశా బాల విమర్శించారు. గురువారం మంగళగిరిలో నియోజవర్గ టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. లోకేష్‌ను విమర్శించే స్థాయి చిరంజీవికి లేదని, ఆయన రాజకీయ జీవితం అంతా అవినీతిమయమని ఆరోపించారు. టిడిపిలో ఉన్న ప్పుడు లోకేష్‌ను వేధించారని, ఇప్పుడు వైసీపీలో ఉండి ఎమ్మెల్యే ఆర్కేకు ఎసరు పెట్టడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

రూ.30 లక్షలతో నూతన భవనం ప్రారంభం

ప్రజాశక్తి - తాడికొండ

తాడికొండలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రూ.30 లక్షలతో నూతనంగా నిర్మించిన భవనాన్ని జిల్లా పరిషత్ ఛైర్మన్ కత్తెర హేని క్రిస్టినా, నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ గురువారం ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివద్ధి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు కార్యక్రమంలో నియోజకవర్గ సలహాదారు బత్తుల బ్రహ్మారెడ్డి,ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి శివ నాగరాజు వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి సర్పంచ్ తోకల సరోజినీ నరసింహారావు, ఎంపీటీసీ నూతక్కి పర్మిళ,నాయకులు బి వెంకటేశ్వర రెడ్డి ఆళ్ల హనుమంతరావు బండ్ల పున్నారావు పాల్గొన్నారు.

నూతనంగా నిర్మించిన భవనాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పరిషత్ ఛైర్మన్ హేని క్రిస్టినా, నియోజకవర్గ సమన్వయకర్త సురేష్ కుమార్

పాత్రికేయులకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-మంగళగిరి

రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి, తాడేపల్లి సహకారంతో మంగళగిరి, తాడేపల్లి పాత్రికేయులు వారి కుటుంబ సభ్యులకు విజయవాడ డాక్టర్ వరుణ్ కార్డియాక్ సైన్సెస్, డాక్టర్ గుంటూరు వరుణ్ సహకారంతో హృదయ సంబంధిత పరీక్షల కోసం ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. మంగళగిరి ప్రెస్ క్లబ్ భవనంలో మంగళగిరి,తాడేపల్లి మండలానికి చెందిన పాత్రి కేయులు ఈ క్యాంపునకు విచ్చేసి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వరుణ్ మాట్లాడుతూ తల్లీతండ్రీ పేరున ఉన్న రాధా లక్ష్మీ హార్ట్ ఫౌండేషన్ ద్వారా వచ్చే సంవత్సరం, ఏప్రిల్ 1 నుంచి 10వ తేదీ వరకు వరకు సుమారు వెయ్యి స్తంట్లు అమర్చాలని, వచ్చే ఏడాదిలో 200 యాంజియోగ్రామ్ లను ఉచితంగా చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అమ రావతి పరిసర ప్రాంతాల్లో ఉన్న విలేకరులకు రూ.12,000 విలు వైన వైద్య పరీక్షలను రూ.500కే చేసే సదుపాయం కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ మంగళగిరి అధ్యక్షులు త్రిపురమల్లు సతీష్ బాబు అధ్యక్షత వహించారు. తాడేపల్లి అధ్యక్షులు మున్నంగి వివేకానంద రెడ్డి ,మంగళగిరి క్లబ్ ట్రైనర్ అనిల్ చక్రవర్తి, మాజీ ప్రెసిడెంట్ మాజేటి వంశీకృష్ణ, కోశాధికారి గాజుల శ్రీనివాసరావు, సెక్రెటరీ అందే మురళి , ప్రెసిడెంట్ అందే రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ వరుణ్

పూర్వ విద్యార్థుల సాయం

ప్రజాశక్తి- పెదనందిపాడు రూరల్

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలోనే మానవత్వం ఉందని కొండపాటూరు జెడ్పి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శీలం అంకారావు అన్నారు. పెదనందిపాడు జడ్పీ పాఠశాలలో 1986- 87 బ్యాచ్ విద్యార్థులు శీలం అంకారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓల్డ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా బుధవారం తాము చదువుకున్న పాఠశాలలో ఒక కార్యక్రమం ఏర్పాటు చేశారు. తమతో పాటు చదువుకొని అనారోగ్యం పాలైన మోహన రావు, కోటేశ్వరరావు కుటుంబాలకు నాటి సహచర విద్యార్థులు కూనిశెట్టి శ్రావణ కుమార్, పెద్ది విజయలక్ష్మి లు రూ.10 వేలు చొప్పున వారికి అందజేశారు. ఈ సందర్భంగా అంకారావు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం దాతలను సత్కరించారు. కార్యక్రమంలో సహచార విద్యార్థి కాకుమాను ఎంపిపి ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా బక్రీద్

ప్రజాశక్తి-గుంటూరు

బక్రీద్ పండుగ సందర్భంగా గురువారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని మార్కెట్ సిగ్నల్స్ వద్ద ఏర్పాటు చేసిన ఈద్గా కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా, రాగ ద్వేషాలకు అతీతంగా ముస్లింలందరూ ఈ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని చెప్పారు. **మంగళగిరి:** మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో బక్రీద్ పండుగను ముస్లింలు గురువారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. త్యాగం, బలిదానం, పరిహతానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగ సందర్భంగా నగరంలోని ఈద్గా మైదానంలో ఉదయం 10 గంటలకు వేలాది మంది ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. చిన్నారులు, యువకులు, పెద్దలు ఈ ప్రార్థనలలో పాల్గొన్నారు. ఈ సం దర్భంగా పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నగరం లోని నిడమర్రు రోడ్డు అర విందా పాఠశాల ఆవరణలో మస్జీద్-ఎ-అన్వరీ ఆధ్వ ర్యంలో ప్రత్యేక నమాజ్ ఆచరించారు. పెద్ద సంఖ్యలో మహిళలు సైతం నమాజ్ కు తరలివచ్చారు. **తాడేపల్లి:** పట్టణంలోని ముగ్గురోడ్డు, నులకపేట, బోసుబొమ్మ సెంటర్, పోలకంపాడు, మహానాడు మసీదుల్లో గురువారం బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నులకపేట నూరాని జామియా మసీదులో షేష్మ అహ్మద్ బక్రీద్ ప్రత్యేకతను వివరించారు. ముస్లింలు అందరూ తప్పనిసరిగా కుర్బాని (దాతృత్యం) ఇవ్వాలని వివరించారు. ప్రజలందరూ త్యాగ నిరతితో జీవించాలని కోరారు.

గుంటూరులో..

తాడేపల్లిలో..

మంగళగిరిలో..

సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ నూకతోటి మెరిమ్మ

మద్యం లేని గ్రామంగా పొన్నెకల్లు

ప్రజాశక్తి - తాడికొండ

పొన్నెకల్లును మద్యం లేని గ్రామంగా తీర్చి దిద్దుతామని సర్పంచ్ నూకతోటి మెరిమ్మ అన్నారు.గురువారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తమ గ్రామం నుండి మద్యం దుకాణం తొలగించడంతో గ్రామం లోని మహిళలు సంతోషంగా ఉన్నారన్నారు. కానీ కొంత మంది స్వలాభం కోసం మద్యం షాపును తీసుకు రావాలని తీవ్రంగా యత్నిస్తున్నారని విమర్శించారు. గ్రామానికి చెందిన మహిళలుగా తాము దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. గతంలో పంచాయతీ తీర్మానం చేసి ఊరిలో మద్యం దుకాణం ఉండరాదని తీర్మానం చేయడం జరిగిందన్నారు. మద్యం దుకాణం ఏర్పాటుకు చర్యలు విరమించుకోవాలని మహిళలు కోరారు. బెల్ట్ షాపులు కొంతమంది నడుపుతున్నారన్న విషయాన్ని మంగళగిరి సెబ్ అధికారులకు ఫిర్యాదు చేయగా వారు అక్రమంగా మద్యం అమ్ముతున్న వారిపై కేసులు నమోదు చేసారని తెలిపారు. మంగళగిరి సెబ్, గుంటూరు ఎక్సైజ్ అధికారులు తమ గ్రామంలో బెల్ట్ షాప్ ల నిర్మూలానకు నిరంతరం పర్యవేక్షించాలని కోరారు.

ఘనంగా ఏకలవ్య జయంతి వేడుకలు

ప్రజాశక్తి-మంగళగిరి

ఏపీ ఎరుకుల సేవా సంఘం మంగళగిరి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతి వేడుకలు గురువారం మంగళగిరి నాంచారమ్మ చెరువు వద్ద జరిగింది. ఏకలవ్య చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించడం జరిగింది. ఏకలవ్యునికి జయంతిని ఉద్దేశించి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పేరం ఏడుకొండలు మాట్లాడుతూ ఏకలవ్య జయంతిని నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎరుకల కుటుంబ సభ్యులకు ఎపి ఎరుకల సేవా సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి. వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి పి.మోజేష్,జిల్లా కార్యదర్శి,తోకల శివ నాగేశ్వరరావు, 4వార్డు మాజీ కౌన్సిలర్ ఉయ్యాల సత్యనారాయణ, సంఘం పట్టణ అధ్యక్షులు పేరం పూర్ణచంద్రరావు, ప్రధానకార్యదర్శి దాసరి గోపి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

కార్యదీక్షకు నిలువుటద్దంగా నిలిచి జాతి గర్వించదగిన వ్యక్తుల్లో ఏకలవ్యుడు ఒకరిని టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు తెలిపారు. గురువారం ఏకలవ్యుడు జయంతి సందర్భంగా తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం ముందు గల ఏకలవ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దాసు, ఇ.పెంచలయ్య, మురళీ, చిన్నపోతుల చిన్నా, శ్రీనివాసరావు, కె.సాయిచంద్ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏరువాక

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న పల్నాడు జిల్లా ఎస్‌పి వై.రవిశంకర్‌రెడ్డి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

తొలి ఏకాదశి సందర్భంగా ఏఆర్ అదనపు ఎస్పి రామచంద్రరాజు ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవి శంకర్ రెడ్డి జిల్లా పోలీస్ ప్రాంగణంలోని వ్యవసాయ క్షేత్రంలో ఏరువాక కార్యక్రమం చేపట్టి కూరగాయల విత్తనాలు చల్లారు. నూతనంగా నిర్మించిన జిల్లా పోలీస్ కార్యాలయ భద్రతా గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. నిత్యం శాంతి భద్రతల పరిరక్షణలో ఉన్న పోలీస్ అధికారులు మరియు సిబ్బంది ఉంటారన్నారు. వారి ఆరోగ్యాన్ని, సంక్షేమాన్ని దష్టిలో పెట్టుకొని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలీస్ క్యాంటీన్ ద్వారా ఆరోగ్యకరమైన భోజనాన్ని అందిస్తున్నామన్నారు. ఈ క్రమంలో క్యాంటిన్‌లో ఉపయోగించడానికి వ్యవసాయ క్షేత్రంలో సేంద్రీయ పద్దతిలో కూరగాయలు, ఆకుకూరలు విత్తనాలు చల్లామని తెలిపారు. సేంద్రియ పద్ధతిలో కూరగాయలు ఆకుకూరల విత్తనాలు చల్లారు. పల్నాడు ప్రజలకు బక్రీద్ మరియు తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయాన్ని నిత్యం కాపలా కాసే సిబ్బంది కొరకు ఏఆర్ అవుట్ పోస్ట్ ప్రారంభించారు. కార్య క్రమంలో ఏఆర్ అదనపు ఎస్పి డి రామచంద్రరాజు, క్రైమ్ అదనపు ఎస్పీ ఎస్ కె చంద్రశేఖర్, ఏఆర్ డిఎస్పి చిన్ని కృష్ణ, డీఎస్పీ కె.వి మహేష్, యు.రవిచంద్ర, సీఐలు,ఆర్.ఐ లు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి జిల్లాలో టిడిపి బస్సు యాత్ర

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

భవిష్యత్ గ్యారంటీ బస్సు యాత్ర 1వ తారీకు నుండి గుంటూరు జిల్లాలో ప్రారంభమవు తుందని టిడిపి జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. గుంటూరు లోని టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ 1వ తేదీ తాడికొండ, 2వ తేదీ ప్రత్తిపాడు, 3వ తేదీ గుంటూరు తూర్పు, 4వ తేదీ తెనాలి, 5వ తేదీ మంగళగిరి నియోజకవర్గాలలో బస్సు యాత్ర జరుగుతుందన్నారు. బస్సు యాత్రలో టిడిపి అభివద్ధి చేసిన వాటిని ప్రజలకు తెలియ చేస్తూ గత నాలుగేళ్లుగా అభివద్ధి లేక నిలిచి పోయిన వాటిని చూపిస్తూ పర్యటన కొనసాగుతుందన్నారు. ముఖ్యమంత్రి బటన్నొక్కుడు సాధారణ మానవునికి ఉపయోగపడని పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బ్రష్టు పట్టించి సర్వనాశనం చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనన్నారు. టిడిపి హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాల పేర్లు మార్చి, మరికొన్ని పథకాలను రద్దు చేసి సంక్షేమానికి నవరత్నాలు పెట్టారని మండిపడ్డారు. తెలుగుదేశం ప్రభుత్వంలో దళితులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు బడుగు, బలహీన వర్గాలకు రక్షణగా నిలిచిందన్నారు. టిడిపి సెంట్రల్ ఆఫీసుపై అప్పిరెడ్డి, అవినాష్ మనుషులు దాడి చేసినా ఇంతవరకు చర్యలు లేవన్నారు. వైసిపి పాలనలో సంక్షేమం కన్నా వినాశనమే ఎక్కువ అన్నారు. నగర పార్టీ అధ్యక్షుడు డేగల ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజలకు భవిష్యత్తులో తెలుగు దేశం పార్టీ చేయనున్న కార్యక్రమాలను ప్రజలకు తెలియజేసి, వారిని చైతన్యపరచాలనే ముఖ్య ఉద్దేశ్యంతో తెలుగుదేశం పార్టీ బస్సు యాత్ర చేపట్టనుందన్నారు. కార్యక్రమంలో కంచర్ల శివరామయ్య, గోళ్ళ ప్రభాకర్, దామచర్ల శ్రీనివాసరావు, మేళం సైదయ్య, నాయుడు ఓంకార్, రావిపాటి సాయి కృష్ణ, తలతోటి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రమేష్ ఆస్పత్రి క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో రమేష్ స్పెషాలిటీ క్లినిక్‌ను గురువారం స్థానిక గుంటూరువారితోట 8వ లైనులో ప్రముఖకార్డియాలజిస్టు డాక్టర్ సాయి ప్రసాద్ ప్రారంభించారు. రమేష్ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ రాయపాటి మమత, డాక్టర్ హరిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మమత మాట్లాడుతూ గుంటూరు ఒన్‌టవున్ ప్రజలకు అందుబాటులోకి ఈ క్లినిక్ ఉంటుందన్నారు. జిల్లా నలుమూలల వచ్చేవారికి బస్టాండ్ వద్ద అందుబాటులో ఉండేందుకు ఈ క్లినిక్ ప్రారంభించినట్టు తెలిపారు. ఎక్స్ రే, ల్యాబ్ తో పాటు ఐదు విభాగాలకు చెందిన కన్సల్టేషన్ డాక్టర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్డియాలజీ న్యూరాలజీ ఆర్థోపెడిక్ గైనిక్ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అత్యవసరమైన కేసులను కలెక్టరేట్‌రోడ్డులోని మెయిన్ హాస్పిటల్ కు పంపించి ట్రీట్మెంట్ ఇవ్వటం జరుగుతుంది అన్నారు.

నిమ్మకాయల నియామకంపై పీఠముడి

అంబటికి ప్రతిష్టాత్మకంగా మారిన మిర్చియార్డు చైర్మన్ గిరి - ప్రతిపాదనలు ఇవ్వని గుంటూరు నేతలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్ యార్డ్‌గా గుంటూరు మిర్చి యార్డు వర్గ రాజకీయాలకు వేదికగా మారుతోంది. మిర్చి యార్డు కేంద్రంగా వైసిపిలో వర్గ విబేధాలు మరోసారి బయట పడ్డాయి. మిర్చి యార్డు చైర్మన్‌గా బిసి సామాజిక తరగతికి చెందిన నిమ్మకాయల రాజ నారాయణను నియమించాలని మంత్రి అంబటి రాంబాబు ఏప్రియల్ 12న సిఎం జగన్‌కు లేఖ రాశారు. ఈ మేరకు అంబటి లేఖను సిఎం అధికారులకు పంపారు. సిఎం కార్యాలయ కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి రాజ్‌నారాయణను చైర్మన్‌గా నియమించాలని మార్కెటింగ్ శాఖకు పంపారు. మార్కెటింగ్ శాఖ అధికారులు ఈ లేఖను తిప్పిపంపుతూ ఒకేసారి మొత్తం కమిటీని ప్రతిపాదించాలని కోరారు. దీంతో రాజ్‌నారాయణ నియామకం గత నెల 26 నుంచి పెండింగ్‌లో పడింది. యార్డు డైరక్టర్లుగా గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గం నుంచి పేర్లు పంపాలని అధికారులు కోరినా ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదు. మంత్రి అంబటి ఎమ్మెల్యేలకు ఫోన్ చేసి ప్రతిపాదనలు పంపాలని కోరినా ఇంతవరకు వారి నుంచి స్పందన రాలేదు. గతంలో గుంటూరు యార్డు పరిధిలో ఉన్న తాడికొండ, పొన్నూరు, ప్రత్తిపాడు నియోజకవర్గాలకు చెందిన వారిని డైరక్టర్లుగా నియమించే వారు. ప్రస్తుతం యార్డు పరిధిని కేవలం గుంటూరు నగరానికి పరిమితం చేయడం వల్ల గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు చెందిన వారినే డైరక్టర్లుగా ఎంపిక చేస్తున్నారు. ఆసియాలోనే అతిపెద్ద యార్డుగా ఉన్న మిర్చి యార్డును ఉమ్మడి జిల్లా మొత్తానికి చెందిన వారికి డైరక్టర్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాల్సి ఉంది. కానీ ప్రస్తుతం గుంటూరు నగరానికి చెందిన రైతుల ముసుగులో వ్యాపారులకే డైరక్టర్ పదవుల్లో అగ్రతాంబూలం ఇస్తున్నారు. గతంలో ఈ యార్డు బిసిలకు రిజర్వు చేసినందున బిసిలకే ఈ పదవి ఇవ్వాలని మంత్రి అంబటి ప్రతిపాదించగా గుంటూరు చెందిన వైసిపి నాయకులు మూడు సార్లు చంద్రగిరి ఏసురత్నంకు అవకాశం ఇచ్చినందున ఈ సారి అగ్రకులాలకు ఇవ్వాలని జిల్లా అధికారుల ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే అంబటి రాంబాబు లేఖకు సిఎం జగన్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో కొంత మంది నేతలకు రుచించడం లేదు. దీంతో డైరక్టరు పదవులకు ప్రతిపాదనలు పంపకుండా కాలయాపన చేస్తున్నట్టు తెలిసింది. సత్తెనపల్లిలో రాజకీయంగా పట్టు సాధించేందుకు నిమ్మకాయల రాజ్‌నారాయణ నియామకాన్ని అంబటి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. జిల్లా లో సీనియర్ రాజకీయ నేత అయిన మాజీ మంత్రి కన్నా లక్ష్మీ నారాయణ సత్తెనపల్లి టిడిపి ఇన్ చార్జ్ పదవి ఇవ్వడం తో స్థానికంగా మంత్రి అంబటి రాంబాబు అప్రమత్తమయ్యారు. కన్నా లక్ష్మీనారాయణ హవా కు గండి కొట్టేందుకు యాదవ సామాజిక వర్గానికి చెందిన నిమ్మకాయలకు అవకాశం ఇవ్వాలని పట్టుబడుతున్నారు. నిమ్మకాయల రాజ నారాయణ గతంలో టిడిపి నుంచి గుంటూరు నగర పాలక సంస్థ లో కార్పోరేటర్ గా పని చేసి ఉన్నాడు. అనంతరం 2009 లో సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయాడు. ఆ తర్వాత నిమ్మకాయల టిడిపి నుంచి వైసిపి లోకి చేరిన సత్తెనపల్లి నియోజకవర్గంను అంటి పెట్టుకోని రాజకీయాలలో కొనసాగుతున్నారు. అయితే తాజాగా కన్నా లక్ష్మీ నారాయణ సత్తెనపల్లి నుంచి టిడిపి అభ్యర్థి గా పోటీ చేస్తారనే ప్రచారం నేపద్యం లో యాదవ సామాజిక వర్గాన్ని ఆకర్షించేందుకు నిమ్మకాయల రాజ నారాయణ కు గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ పదవి ఇస్తే రాజకీయంగా మనకు మంచి మైలేజ్ వస్తుందని మంత్రి అంబటి రాంబాబు సిఎం జగన్ కు వివరించి యార్డ్ చైర్మన్ గా నిమ్మ కాయల రాజ నారాయణ పేరు ను ఎంపిక చేయించారు. మిర్చి యార్డు పై తొలి నుంచి ఎమ్మెల్సీ అప్పి రెడ్డి ఆదిపత్యం ఉంటోంది. ఎవరూ ఛైర్మన్ గా ఉన్న అప్పి రెడ్డి హవా యార్డ్ లో కొనసాగేది. గత ఛైర్మన్ చంద్రగిరి ఏసు రత్నం ఛైర్మన్ గా ఉన్న సమయంలో అది కొంత మేర తగ్గింది. ఇప్పడు నిమ్మ కాయల రాజ నారాయణ ఛైర్మన్ అయితే అప్పి రెడ్డి ఆదిపత్యానికి పూర్తిగా గండిపడే అవకాశం ఉంది. దీంతో మంత్రి అంబటి రాంబాబు వర్గం సూచించిన నిమ్మ కాయల రాజ నారాయణ కు ఛైర్మన్ పీఠం దక్కకుండా అడ్డకున్నారనే విమర్శలు సొంత పార్టీ నుంచి వ్యక్తం అవుతున్నాయి.

ఫొటోలను మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్

దిశకు ఫిర్యాదుతో కేసు నమోదు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రేమ పేరుతో యువతి ఫోటోలను మార్ఫింగ్ చేసిన ఒక యువకుడు వేధింపులకు గురిచేయడంతో దిశ యాప్ ద్వారా ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన పెదనందిపాడులో గురువారం వెలుగు చూసింది. పోలీసులు కథనం ప్రకారం పెదనందిపాడుకు చెందిన ప్రవీణ్ అనే యువకుడు స్థానికంగా వుండే యువతిని ప్రేమిస్తున్నానని నమ్మించాడు. చనువుగా ఉంటూ యువతిని ఇబ్బందులకు గురిచేయాలని ప్రయత్నించాడు. ప్రవీణ్ దురుద్దేశాన్ని గ్రహించిన యువతి దూరంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో ఇద్దరూ కలిసి తీసుకున్న ఫోటోలను చూపించి యువతిని బ్లాక్ మెయిల్ చేసాడు. భయబ్రాంతులకు లోనైన యువతి దిశ ఎస్ఓఎస్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేసింది. బాధిత యువతికాల్ చేసిన పది నిమిషాల వ్యవధిలోనే

పెదనందిపాడులో ఉన్న యువతి వద్దకు పోలీసులు చేరుకున్నారు. ప్రవీణ్ మార్ఫింగ్ చేసిన ఫోటోలను దిశ టీం సేకరించారు. బాధిత యువతికి ధైర్యం చెప్పి భరోసా ను కల్పించారు. యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రవీణ్ పై పెదనందిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

మెదడు వ్యాధులపై అంతర్జాతీయ పరిశోధన సంచిక

కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ఛైర్మన్ కోనేరు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

మానవ మెదడు సంక్లిష్టమైన అవయవమని, మెదడును అర్థం చేసుకోవడం నేటికీ ఒక సవాలుగానే ఉందని కెఎల్ డీమ్డ్ యూనిర్శిటీ ఛైర్మన్ కోనేరు సత్యన్నారాయణ అన్నారు. వివిధ విభాగాలకు చెందిన 43మంది అధ్యాపకుల బృందం ప్రఖ్యాతి గాంచిన న్యూరో శాస్త్రవేత్త డాక్టర్ కెఎస్. జగన్నాథారావు పర్యవేక్షణలో మెదడు పనితీరు, వ్యాధులపైన పని చేస్తుందని తెలిపారు. జర్నల్ ఆఫ్ అల్జీమర్స్ డిసీజ్‌లో "న్యూరోడెజనరేటివ్ వ్యాధులలో పరమాణు మార్గాలు మరియు చికిత్సా సవాళ్ళ గురించి ప్రత్యేక సంచికను త్వరలో ప్రచురించ నున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదడు జీవశాస్త్రంలో కొంత భాగం మాత్రమేనని, అందువల్ల, ఆరోగ్యకరమైన వృద్ధాప్యం, వయస్సు-సంబంధిత రుగ్మతలను అర్థం చేసుకోవడం చాలా ఆసక్తిని కలిగిస్తుంద న్నారు. అల్జీమర్స్ (మతిమరుపు), పార్కిన్సన్స్ వ్యాధులు వంటి న్యూరో డెజెనరేటివ్ రుగ్మతలు ప్రపంచ వ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజలను ప్రభావితం చేస్తున్నాయన్నారు. ప్రస్తుతం 55 మిలియన్ల మంది ప్రజలు మెదడు వ్యాధులతో బాధపడుతున్నారని అన్నారు. ఇది కాస్తా 2050 నాటికి 155 మిలియన్లకు చేరుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. సాధారణ ఆరోగ్యకర మైన మెదడు 1.5 కిలోలు ఉంటే న్యూరోడెజనరేటివ్ వ్యాధులు సోకి వారికి మెదడు పరిమాణం తగ్గిపోతుందన్నారు. న్యూరోడెజనరేటివ్ వ్యాధులతో సంబంధం ఉన్న శారీరక లేదా మానసిక లక్షణాలతో బాధపడుతున్న రోగులకు సహాయపడే కొన్ని చికిత్సలు ఉన్నాయన్నారు. దీంతో వ్యాధి పురోగతి మందగించడం మినహా ఎటువంటి నివారణ లేదన్నారు. అందువల్ల మెదడు పరిశోధనపై చాలా ముందు చూపు అవసరమన్నారు. ముఖ్యంగా డాక్టర్ ఎడ్వర్డో ఒర్టెగా, నేషనల్ సెక్రటేరియట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్, పనామా వారు న్యూరోడెజనరేటివ్ వ్యాధుల గురించి నవల మాలిక్యులర్ పాత్‌వేస్ మరియు థెరప్యూటిక్ ఛాలెంజ్‌ల రంగంలో ప్రత్యేక సంచిక పత్రాలను ప్రచురించిందన్నారు. ప్రచురణ ఖర్చు , ఓపెన్ యాక్సెస్‌కు నేషనల్ సెక్రటేరియట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్, పనామా మద్దతు ఇస్తుందన్నారు. ఈ ప్రత్యేక సంచికకు అతిథి సంపాదకులు కెఎల్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఛాన్సలర్, డాక్టర్ కెఎస్. జగన్నాథరావు, అంతర్జాతీయ బృంద సభ్యులు ఆస్ట్రేలియా, చైనా, హాంకాంగ్, ఇరాన్ దేశాలనుండి ఉంటారన్నారు.